
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 7 ఆగస్టు 2024 | 5



గోదావరి వరద తగ్గుముఖం

ధవళేశ్వరం, ఆగస్టు6: గోదావరి వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద మంగళవారం రాత్రి 8 గంటలకు నీటిమట్టం 7.90 అడుగులుగా నమోదైంది. కాటన్ బ్యారేజ్ 175 గేట్లు ఆల్ క్లియర్ పొజిషన్‌లో ఉండగా 5,09,855 క్యూసెక్కులు నీరు దిగువకు వెళుతోంది. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుతున్న నీటిమట్టం మంగళవారం రాత్రి 7 గంటలకు 32.10 అడుగులుగా నమోదైంది.



విజిలెన్స్ ఏదీ.. ఎన్‌ఫోర్స్ ఎక్కడ?



- వైసీపీ హయాంలో నిర్వీర్యం
- ఇసుక, ఇతర మైన్స్ వైపు దృష్టిపెట్టని అధికారులు
- టీడీపీ నేతలపై విచారణకు.. చిన్న తనిఖీలకే నాడు పరిమితం
- అధికారులూ కొరతే
- జూన్ నుంచి డీఎస్పీ పోస్టు ఖాళీ
- సీఐలు, ఎఫ్ఆర్వో, తహశీల్దార్ పోస్టులూ ఖాళీనే

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

విజిలెన్స్ దెబ్బతిన్నా.. ఎన్‌ఫోర్స్ తగ్గిపోయినా.. ఇక ఏ వ్యవస్థలూ సక్రమంగా నడవలేవు. ప్రభుత్వ నిధులు, అనుమతులతో నడిచే ఏ వ్యవస్థ మీద అయినా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ దృష్టి ఉండాలి. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతీ పైసా సక్రమంగా వినియోగం అయ్యేటట్టు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా, లేదా తనిఖీ చేయడానికి, ఎక్కడైనా దుర్వినియోగమైనా పట్టుకోవడానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఉంది. దీనికి అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి ఉంటారు. డీఎస్పీ ఉంటారు. వీరితోపాటు మైన్స్, రెవెన్యూ, కమర్షియల్, ఇంజనీరింగ్, వ్యవసాయం తదితర ముఖ్య శాఖల నుంచి కూడా అధికారులు ప్రత్యేకంగా ఉంటారు. సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుల్ స్థాయి అధికారులు, సిబ్బంది ఉంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో రాజమహేంద్రవరం కేంద్రంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కార్యాలయం ఉంది. 2019 వరకూ ఈ డిపార్ట్‌మెంట్‌కు చేతినిండా పని ఉండేది. వందల కోట్ల అక్రమాలను వెలికి తీసింది. ఇసుక, లాటరైట్, గ్రావెల్, మెటల్, మట్టి అక్రమాలతోపాటు గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల పరిధిలో జరిగే అక్రమ లేఅవుట్లు, అధికారుల అక్రమాలను సైతం వెలికితీసింది. వివిధ డిపార్ట్‌మెంట్ల ద్వారా ప్రజలకు అందవలసిన స్కీమ్‌లు, ఇతర పథకాలలోని అక్రమాలను కూడా వెలికితీసేది. అక్రమాలు వెలికితీసి, వాటి విలువ కట్టి, లక్షల నుంచి కోట్ల వరకు ఫైన్ వేసి రికవరీ కోసం ప్రభుత్వానికి సిఫార్స్ చేసేది. చాలా వరకూ రికవరీ కూడా అయ్యేది. ఇంకా ఫైన్ రూపంలో వందల కోట్ల పెండింగ్ కూడా ఉంది. ముఖ్యంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అంటేనే వణుకుపుట్టేది. వీరికి చిక్కితే తమ పని ఖతం అన్న బెదురు ఉండేది. కానీ ఇప్పుడు ఇదంతా గతం. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కోరలు పీకేయడంతో నిర్వీర్యమైపోయింది. మొదట్లో వంతాడ, చింతలూరు ప్రాంతంలోని లాటరైట్‌పై సర్వే చేయించి, కనీసం ఆ నివేదికను బయట పెట్టకుండా, తర్వాత అక్కడి క్వారీ లీజుదారులను ఖాళీ చేయించి వైసీపీ నేతలు దోసుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇక అటువైపు చూసే అవకాశమే లేకుండా పోయింది. టీడీపీ నేతలపై ఎంక్వయిరీలు చేయించడం వంటి కక్షసాధింపు పనులకే వీరిని మొదట్లో పరిమితం చేశారు. వంటనూనెల ధరలు విపరీతంగా పెరిగిపోయిన సమయంలో వాటిపై దృష్టిపెట్టడం సాధారణం. రూ.100లోపు ఉండే లీటరు ఆయిల్ ధరలు రూ.200 దాటేసిన సంగతి తెలిసిందే. అయినా స్పందన లేదు. అపుడప్పుడూ పీడీఎస్ షాపులు తనిఖీ చేయడం, అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ, డొమెస్టిక్ గ్యాస్‌ను కమర్షియల్‌గా వాడుకోవడంపై తనిఖీలు వంటివి మాత్రమే చేసేవారు. దీంతో అనేక వ్యవస్థల్లో అక్రమాలు పెరిగిపోయాయి. గోదావరి ఇసుక అక్రమాలు రూ.కోట్లలో జరిగినా పట్టించుకోలేదు. కొండలకు కొండలే మాయమైపోయినా ఈ డిపార్ట్‌మెంట్‌లో కదలిక లేదు. పీడీఎస్ బియ్యం విషయంలో కాకినాడ పోర్టు నుంచి రూ.వేల కోట్ల కుంభకోణం జరిగినా పట్టించుకోలేదు. ఏదో ఉన్నామని చెప్పడానికి చిన్నాచితకా తనిఖీలతో సరిపెట్టారు.

పోస్టులూ ఖాళీనే...

మరోవైపు ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ మాత్రమే ఉన్నారు. డీఎస్పీ పోస్టు జూన్ నుంచి ఖాళీగా ఉంది. ఇద్దరు సీఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో ఒకటి ఏడాది పైనుంచి ఖాళీనే. ఎఫ్ఆర్వో పోస్టు ఖాళీ, తహశీల్దారూ లేరు. సిబ్బంది లేకుండా ఇక దాడులు ఎలా చేస్తారో మరి.

కూటమి ప్రభుత్వం దృష్టి

లెన్స్ పోగొట్టుకుని, ఫోర్స్ కోల్పోయిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌ను తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దృష్టిపెడుతోంది. ఇప్పటికే డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వంటి శాఖల్లో జరిగిన అక్రమాల గురించి గొంతెత్తిన సంగతి తెలిసిందే. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఫోర్స్‌లో ఉంటేనే కాస్త భయం ఉంటుంది. ఇది ఏ డిపార్ట్‌మెంట్‌లో అక్రమాలు చేసినా ఆరా తీసి రిపోర్టు ఇవ్వవచ్చు. 2019 వరకూ చాలా ఫోర్స్‌గా, మంచి విజిలెన్స్‌తో ఈ డిపార్ట్‌మెంట్ పనిచేసింది. వైసీపీ తన అక్రమాలకు అడ్డులేకుండా ముందుగా ఈ శాఖను నిర్వీర్యం చేసేసింది. తర్వాత అక్రమాలు, అవినీతి వ్యవహారాలను యథేచ్ఛగా చక్కపెట్టుకున్నట్టు అనేక ఆరోపణలు ఉన్నాయి. త్వరలో మళ్లీ ఈ డిపార్ట్‌మెంట్ మంచి పవర్‌ఫుల్ ఫోర్స్‌గా నిలబడే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు. ఇక ఈ శాఖకు ఏవీ అప్పారావు రోడ్డు నుంచి శ్రీరామపురం వెళ్లేదారిలో వేపదిబ్బ ప్రాంతంలో సొంత స్థలం ఉంది. అక్కడ సొంతభవనం నిర్మిస్తే పాలనా సౌలభ్యం కూడా కలుగుతుంది.

100 రోజుల యాక్షన్ ప్లాన్

- ఇక ఉద్యోగులందరూ పరుగులు పెట్టాల్సిందే
- హార్డ్‌వర్కు కాదు.. స్మార్ట్ వర్కు చూపాలి
- సీఎంతో కలెక్టర్ల కాన్ఫరెన్స్ వివరాలను తెలిపిన కలెక్టర్

రాజమహేంద్రవరం, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో 'విజన్ 2047'పై చేసిన దిశానిర్దేశం ప్రకారం జిల్లాలో రాబోయే 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఆయా శాఖలు రూపొందించిన ప్రాజెక్టు నివేదికల ఆధారంగా జిల్లా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయవలసి ఉంది' అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టంచేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం సాయంత్రం ఆమె ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.నరసింహులుతో కలసి జిల్లా డివిజన్, మండల స్థాయి అధికార్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఈ ప్రణాళికను సిద్ధంచేయాలన్నారు. 'విజన్ 2047' నోడల్ అధికారిగా జిల్లాస్థాయిలో ముఖ్య ప్రణాళికా అధికారిని నియమించినట్టు చెప్పారు. త్వరలో రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమానికి జిల్లా నుంచి ఐదుగురు అధికారులు, సిబ్బందిని మాస్టర్ ట్రైనింగ్ కోసం పంపించనున్నట్టు చెప్పారు. శిక్షణ తీసుకున్నవారు జిల్లాలో శాఖలవారీ సహాయ శిక్షణ బృందాలు ఏర్పాటుచేసి కార్యక్రమాలు అమలుచేయనున్నట్టు చెప్పారు. ఇక నుంచి ఉద్యోగులు అందరూ పరుగులు పెట్టాలి. హార్డ్‌వర్కు కాదు.. స్మార్ట్‌వర్కు ఉండాలని ఆమె స్పష్టంచేశారు. ప్రతికూల కథనాలు, వార్తలకు సంబంధించి అధికారులు సహేతుక వివరణ ఇవ్వవలసి ఉందన్నారు. కౌలు రైతులకు 100 శాతం సీసీఆర్సీ కార్డులు, డేటా ఎంట్రీ పూర్తిచేసి, బ్యాంక్ రుణాలు ఇవ్వాలని చెప్పారు. వ్యవసాయ, హార్టీకల్చర్ రంగాల్లో కౌలురైతుల వివరాల ప్రకారం సీసీఆర్సీ కార్డులు జారీచేయాలన్నారు. భూసార పరీక్షల లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్నం భోజనం పథకం కింద 100శాతం విద్యార్థులు హాజరు కావాలని చెప్పారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సమన్వయ శాఖలతో చర్చించి, ప్రణాళిక రూపొందించి, అమలుచేసే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. సమస్య గుర్తించి..ఎందుకు? ఎలా, ఎందుకు కాదు అనే విధానంలో పరిష్కారం ఉండాలని ఆదేశించారు. ఆయా సమస్యలపై సమగ్ర అవగాహన ఉండాలన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్క లబ్ధిదారునికి ఇళ్ల నిర్మాణాలపై దృష్టిపెట్టాలని కలెక్టర్ చెప్పారు. మండల ప్రత్యేకాధికారులు ప్రతీ వారం ఒకరోజు క్షేత్రస్థాయిలో హౌసింగ్‌పై సమీక్షించాలని చెప్పారు. మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఈ-ఔషధి, డాక్టర్ల ఫేషియల్ అటెండెన్స్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పంపిణీ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలు, వసతి గృహాల నిర్వహణ తదితర అంశాలపై నివేదిక అందజేయాలన్నారు. పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో ధరల నియంత్రణ కమిటీ ద్వారా ఎప్పటికప్పుడు ప్రతీ ఒక్క వినిమయ వస్తువుల ధరలు నియంత్రణ చేపట్టాలన్నారు. జిల్లాలో ఆయా వస్తువులను కొనుగోలు చేసి, ధరలు పరిశీలించి, ధరల పెరుగుదల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం









మంత్రి దుర్గేష్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నేత గన్ని కృష్ణ, ఆదిరెడ్డి అప్పారావులను సత్కరిస్తున్న దృశ్యం

- కూటమి ప్రజాప్రతినిధుల సత్కార సభలో మంత్రి దుర్గేష్
- మంత్రి సహా ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి, బత్తుల తదితరులకు ఘన సన్మానం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6: తూర్పుగోదావరి జిల్లాను అన్ని రంగాల్లోను అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలోని హోటల్ రివర్‌బేలో మంగళవారం రాత్రి జిల్లాలో కూటమి ప్రజాప్రతినిధులను టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. దీనికి మంత్రి దుర్గేష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బాలరామకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణలు అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారిని యర్రా వేణుగోపాలరాయుడు ఘనంగా సత్కరించారు. తొలుత వేణు మాట్లాడుతూ ఎంతో అనుభవంతో జిల్లాలో అభివృద్ధికి తనదైన ముద్ర వేసిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల, ఈ ప్రాంతంపై అవగాహన కలిగిన నేతగా మంత్రి దుర్గేష్, నూతన ఆలోచనలతో అభివృద్ధిని కాంక్షించే ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వంటి ఆలోచనపరులు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు చాణక్య నీతి, గన్ని కృష్ణలాంటి సీనియర్ కమిట్‌మెంట్ నాయకులు కలిసి జిల్లాలో విద్యా, వైద్యం, ఉపాధి రంగాలను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మీ ఉద్దేశానికి తగ్గట్టుగానే ఈ జిల్లాను అభివృద్ధి చేస్తామని చెప్పారు. చంద్రబాబువంటి విజనరీ కలిగిన నాయకుడి సారథ్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో తామంతా కష్టపడి పనిచేస్తామన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబు పడుతున్న కష్టాన్ని అతి దగ్గరగా చూస్తున్నామన్నారు. మన జిల్లాలో ఎన్నో సహజ వనరులు ఉన్నాయన్నారు. 2027లో పుష్కరాలకు ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి చేపడతామన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలనూ ప్రగతి పథంలో తీసుకువెళ్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణలు మాట్లాడారు. జిల్లా అభివృద్ధితో శక్తివంచన లేకుండా తామంతా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, యనుముల రంగబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీడీపీ శెట్టి బలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ మరుకుర్తి రవియాదవ్, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, నూర్ బాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్, రామినీడి మురళీ పాల్గొన్నారు.



అఖిలభారత పశుగణన పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

సెప్టెంబరు 1 నుంచి పశుగణన

- శిక్షణా కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి
- పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు6: పశుగణనకు సంబంధించిన శిక్షణా కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 21వ అఖిల భారత పశుగణనకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీ నుంచి డిసెంబరు 31వ తేదీ వరకూ అఖిలభారత పశుగణన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. పశువుల గణనను అంకితభావంతో కచ్చితత్వంతో పూర్తిచేయాలని చెప్పారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు, డీఆర్వో నరసింహులు, రాజమహేంద్రవరం డివిజన్ పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ మక్కెన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి పశుగణన చేపట్టాలి ...

పశుగణనలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రతి ఇంటికీ వెళ్లి కచ్చితమైన గణనచేయాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ టీశ్రీనివాసరావు స్పష్టంచేశారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని జిల్లా పశు సంవర్ధకశాఖ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి పశుగణన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 9వ తేదీ వరకూ ఈ శిక్షణా కార్యక్రమం జరగనుంది. అనపర్తి, బిక్కవోలు, కడియం, రాజమహేంద్రవరం రూరల్, రాజమహేంద్రవరం అర్బన్, గోపాలపురం, తాళ్లపూడి మండలాల నుంచి ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.16 లక్షల కుటుంబాలు ఈ రంగంలో ఉన్నాయన్నారు. సంపూర్ణమైన, సవివరమైన పశుగణన చేయాలని ఆదేశించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ అయిరెడ్డి వీరప్రసన్నకుమార్, రాజమండ్రి డివిజన్ పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ మక్కెన వెంకటేశ్వర్లు, డీఏ హెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



హర్షకుమార్‌తో కలిసి మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

పెద్దిరెడ్డిపై వేటు తప్పదు

బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయాదవ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6: వైసీపీ నేత పెదిరెడ్డి రామచంద్రారెడ్డిపై వేటు తప్పదని బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయాదవ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అమలాపురం మాజీ ఎంపీ, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ జీవీ హర్షకుమార్‌ను మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా వారు కొద్దిసేపు పోలవరం, వర్గీకరణ అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం రామచంద్రయాదవ్ విలేకరులతో మాట్లాడారు. పెద్దిరెడ్డి ఎన్నిక చెల్లదన్నారు. అక్కడ జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో ఆధారాలతో న్యాయస్థానానికి నివేదించానన్నారు. అతని ఎన్నిక అనైతికమని, త్వరలోనే పెదిరెడ్డిపై వేటు తప్పదని హెచ్చరించారు. ఇక రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక లోపాలున్నాయని చెప్పారు. వాటిని పరిశీలన చేసి సరిచేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజ్యాంగ సవరణ జరిగి పార్లమెంట్‌లో తీర్మానం చేశాక సుప్రీం కోర్టు తీర్పు నివ్వాల్సి ఉండగా దానికి విరుద్ధంగా జరిగిందన్నారు. వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి తమ బీసీ నేతలతో చర్చించి మద్దతు ఇస్తామన్నారు. అనంతరం హర్షకుమార్ మాట్లాడుతూ పోలవరం డయాఫ్రంవాల్, కాఫర్ డ్యామ్‌లు నిర్మాణాల్లో అనేక లోపాలున్నాయని వాటిపైన, వర్గీకరణ అంశాలపైన త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని రామచంద్రయాదవ్, తాను నిర్ణయించుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవి శ్రీరాజ్, అత్తిలి తదితరులు పాల్గొన్నారు.



రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ నమూనాను రైల్వే అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తిలో రూ.10 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమం

రైల్వే అధికారులతో కలిసి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

అనపర్తి, ఆగస్టు 6 : అనపర్తిలోని మూతపడ్డ 413 రైల్వే గేటు స్థానే ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణం కోసం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన కృషి త్వరలోనే సాకారం కానుంది. రైల్వే గేటు మూత పడడంతో గేటు ఆవలివైపు ఉన్న కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, రైస్‌మిల్లులు, పౌల్ట్రీ ఫారాలకు వెళ్లే వ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2014-19 మధ్య ఎమ్మెల్యేగా ఉన్న నల్లమిల్లి బ్రిడ్జి నిర్మాణం కోసం చేసిన కృషి ఫలించి ఫలితం అందే సమయానికి ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. తిరిగి కూటమి అభ్యర్థిగా విజయం సాధించిన ఎమ్మెల్యే నల్లమిల్లి ఇటీవల రాజమహేంద్రవరంలో రైల్వే డీఆర్ఎమ్‌తో జరిపిన చర్చల ఫలితంగా ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు లభించాయి. అనపర్తి రైల్వే స్టేషన్‌లో అమృత్‌భారత్ ఫేజ్ 1లో భాగంగా రూ.24 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం రైల్వే సీనియర్ ఇంజనీర్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలించి బ్రిడ్జి నిర్మాణం కోసం రూపొందించిన నమూనా చిత్రపటాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ఇక్కడి ప్రజల చిరకాలవాంఛగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ముందు రైల్వే స్థలం ఎక్కడి వరకూ ఉందో తేల్చి, అవసరమైన స్థల సేకరణ చేసేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే అనపర్తిలో జన్మభూమి హాల్ట్‌ను సాధిస్తామని ఎన్నికల్లో ఎంపీ పురందేశ్వరి ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చాయన్నారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా ప్రారంభమౌతాయన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ ఇంజనీర్ శ్రీనివాస్, గజశక్తి టీమ్ సభ్యులు, ఎన్డీయే నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, మామిడిశెట్టి శ్రీను, బాసి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, బాబూరావు, కర్రి వెంకటరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



విమానాశ్రయం వద్ద నర్సరీ ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న ప్రశాంతి

మధురపూడి విమానాశ్రయం వద్ద కడియం పూల సోయగాలు ఏర్పాటు

క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

కోరుకొండ, ఆగస్టు6: కడియం నర్సరీలను పర్యాటక రంగం అభివృద్ధిలో భాగస్వామ్యం చేసే దిశగా మధురుపూడి విమానాశ్రయం అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ మధురుపూడి విమానాశ్రయాన్ని సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే క్రమంలో కడియం నర్సరీలకు అదనపు ఆకర్షణ, ఆదాయం సమకూర్చేవిధంగా నర్సరీ సోయగాలు, పచ్చదనం పరిఢవిల్లేలా స్టాల్‌లు ఏర్పాటుచేసేందుకు క్షేత్రస్థాయిలో ఇక్కడ కలెక్టర్ పరిశీలన చేశారు. 2027 పుష్కరాలకు ముందుగానే హరివిల్లు పూలస్టాల్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో సాంస్కృతిక, పర్యాటక, ఆధ్యాత్మిక, నర్సరీల హబ్‌గా గుర్తింపు తేవాలని భావిస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. విమానాశ్రయంలో కడియం నర్సరీలకు వన్నె తీసుకొచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి సమగ్ర కార్యాచరణలో రూపకల్పనలో భాగంగా తాను పరిశీలన చేశానని తెలిపారు. అలాగే ప్రముఖుల పర్యటన సందర్భంగా రూట్‌మ్యాప్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఆర్డీవో కేఎల్ శివజ్యోతి, ఎయిర్‌పోర్టు అధికారి ఎస్.జ్ఞానేశ్వర్‌రావు, ఏపీఎంఐపీ అధికారి ఎ.దుర్గేష్ పాల్గొన్నారు.



చెట్టును పరిశీలించడానికి వచ్చిన డీఎఫ్‌వో

సినిమా చెట్టును తిరిగి బతికిస్తాం!

సినిమా చెట్టును శాస్త్రీయ పద్ధతిలో తిరిగి బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా డీఎఫ్‌వో బి.నాగరాజు తెలిపారు. కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఒడ్డున ఉన్న సినిమా చెట్టు సోమవారం తెల్లవారుజామున పడిపోయిన సంగతి తెలిసిందే. మంగళవారం డీఎఫ్‌వో బి.నాగరాజు, డీఆర్‌వో వేణుగోపాల్, ఎఫ్‌బీవో ఎం.కార్తీక్‌లు ఈ సినిమా చెట్టును పరిశీలించారు. కాగా రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ సభ్యులు పరిశీలించారు. గ్రామస్తులు సహకరిస్తే పడిపోయిన సినిమా చెట్టును బతికించడానికి సహకారం అందిస్తామని, లేదా కొత్త చెట్టును తీసుకువచ్చి అక్కడ ఏర్పాటుచేస్తామన్నారు. అమెరికాలోని వాషింగ్‌టన్‌కు చెందిన ఉయ్యూరి లోకేశ్ సినిమా చెట్టును బతికించడానికి తమవంతు సహకారం అందిస్తామని ముందుకు వస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

- కొవ్వూరు

అన్నవరం దేవస్థానంలో దాతలకు ప్రత్యేక సౌకర్యాల కల్పనకు

డిజిటల్ కార్డులు

రూ.లక్ష దాతలకు గోల్డ్, రూ.10లక్షలకు డైమండ్, ఆపై ప్లాటినం కార్డులు



దాత చక్కా తాతబాబుకు డోనార్‌కార్డు అందజేసి కార్యక్రమం ప్రారంభిస్తున్న ఈవో

అన్నవరం, ఆగస్టు 6: దేవాలయాలలో దాతలకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆలయాలలో అభివృద్ధి పనులు మరింతగా జరుగుతాయని ఈవో రామ చంద్రమోహన్ పేర్కొన్నారు. మంగళవారం అనివేటి మండపంలో జరిగిన కార్యక్రమంలో తొలికార్డును తునికి చెందిన చక్కా తాతబాబుకు అందజేశారు. దేవస్థానంలో వివిధ పథకాలకు విరాళం అందించిన దాతల వివరాలను ఆన్‌లైన్ చేసి వారిచ్చిన విరాళాలను బట్టి కార్డులను జారీచేస్తారు. రూ.లక్ష విరాళమిచ్చిన వారికి గోల్డ్, రూ.10లక్షలు విరాళమిచ్చిన వారికి డైమండ్, రూ.10లక్షలు పైబడి విరాళమిచ్చేవారికి ప్లాటినం కార్డులు అందజేయనున్నారు. వీటిద్వారా భక్తులు ఏ కార్యాలయంను సంప్రదించకుండా నేరుగా వారికి కావాల్సిన సౌకర్యాలు అందజేస్తారు. గదుల కేటాయింపు, ప్రత్యేక దర్శనాలు, ఇతర సదుపాయాలు వీటిలో ఉంటాయి. దీంతోపాటుగా వాట్సాప్ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు వెల్లడించారు.

వజ్ర కిరీటం, వజ్ర కర్ణాభరణాలకు శాస్త్రోక్తంగా సంప్రోక్షణ



సంప్రోక్షణ అనంతరం వజ్రకిరీటం, వజ్ర కర్ణాభరణాలు

ఇప్పటివరకు వజ్రకిరీటధారిగా భక్తులకు దర్శనమిస్తున్న సత్యదేవుడు, మంగళవా రం నుంచి దేవేరి అనంత లక్ష్మీ అమ్మవారు వజ్రకిరీటంలో దర్శనమిచ్చారు. సోమవారం దాత మట్టే సత్యప్రసాద్ దంపతులు దేవస్థానం అధికారులకు వీటిని అందించిన సంగతి విదితమే మంగళవారం వేకువజామున వజ్రకిరీటం, వజ్రకర్ణాభరణాలకు శాస్త్రోక్తంగా దాత దంపతులచే పండితులు సంప్రోక్షణ, ఇతర పూజాదికాలు నిర్వహించారు. అనంత రం 7గంటలకు స్వామి,అమ్మవార్లను వజ్ర కిరీటం, వజ్రకర్ణాభరణాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా స్వామి,అమ్మవార్లను నూతనంగా దర్శనమివ్వడంతో భక్తులు తన్మయత్వం చెందారు.

అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా రమేష్‌బాబు



అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ తన కుమార్తె వివాహం కారణంగా ఈనెల 20వ తేదీవరకు సెలవుపై వెళ్లనుండడంతో ఆయన స్థానం లో ఇన్‌చార్జి ఈవోగా అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న డీఎల్‌వీ రమేష్‌బాబును నియమిస్తూ దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు 10సంవత్సరాలుగా అయన అన్నవరం దేవస్థానంలో సహాయ కమిషనర్‌గాను, ఏడాదిపాటు డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తూ పాలనాపరమైన వ్యవహారాల్లో ఆయనకు అనుభవం ఉండ డంతో దేవదాయశాఖ ఉన్నతాధికారులు అయన సేవలను గుర్తించి ఇన్‌చార్జి పదవి అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈవో మాట్లాడుతూ సత్యదేవుడు తనకు ఇచ్చిన అవకాశాన్ని భక్తుల సౌకర్యాల కల్పనకు పాటుపడతానని రమేష్‌బాబు తెలిపారు.

నేటి నుంచి భీమేశ్వరస్వామివారి దర్శనం

● రెండో రోజు సంప్రోక్షణ కార్యక్రమాలు



గర్భాలయాల తాళాలు అందజేస్తున్న పురావస్తుశాఖ అధికారులు

ద్రాక్షారామ, ఆగస్టు 6: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరస్వామివా, మాణిక్యాంబ అమ్మవార్ల మూలవిరాట్ల దర్శనానికి బుధ వారం ఉదయం 11 గంటల నుంచి అనుమతించనున్నారు. ఆలయంలో మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి పనుల నేపథ్యంలో సోమవారం సంప్రోక్షణ పూజలు ప్రారంభించారు. మంగళవారం రెండోరోజు కూడా సంప్రోక్షణ పూజలు కొనసాగాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, కుచ్ఛత్ర యం, పున:పూజలు, ఉదకశాంతి, శతరుద్రపారాయణ, శ్రీసూ క్త, దుర్గా సూక్తపారాయణ జరిగాయి. మధ్యాహ్నం శుక్ల యజుర్వేదపారాయణ, రుద్రహోమం, చండీ హోమం, నీరాజనమంత్రపుష్పాలు సమర్పణ నిర్వహించారు. ఆలయ వేదపండిత బృందం, అర్చకులు, స్వస్తివాచకులు శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.టి.వి.సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలకు ఏర్పాట్లు

సామర్లకోట, ఆగస్టు 6: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారి మందిరం ఎదుట శ్రావణమాసం శుక్రవారాలలో భక్తులచే సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించనున్నందున మహిళా భక్తులు ఆ పూజలలో పాల్గొనేందుకు ముందుగా ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో తమ గోత్ర, నామాలతో నమోదు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. మొదటి శుక్రవారం ఈనెల 9న, మూడవ శుక్రవారం 23న, నాల్గవ శుక్రవారం 30న మహిళలచే సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజా సామగ్రి, ప్రసాదాలు తదితర సామగ్రి పలువురు దాతల సౌజన్యంతో అందజేస్తామన్నారు. సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలలో పాల్గొనే భక్తులతోపాటు వెంట వచ్చిన మరొకరికి ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదాలు అందజేయనున్నట్లు పేర్కొంటూ మహిళా భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఈవో నీలకంఠం తెలిపారు.



ఆలయ తూర్పురాజగోపురం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



పుష్పాలంకరణతో ఆకట్టుకున్న ప్రత్యేకవేదిక

వైభవంగా సత్యదేవుడి ఆవిర్భావ దినోత్సవం

● ఘనంగా ఆయుష్య హోమం ● పోటెత్తిన భక్తులు

అన్నవరం, ఆగస్టు 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆవిర్భావ దినోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. వేకువజామున రెండు గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింప చేశారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మూలవరులకు దివ్యాభరణాలు, నూతన పట్టువస్త్రాలను ధరింపచేసి, సర్వదర్శనాలను ఉదయం 7.30కు ప్రారంభించారు. 9గంటలకు ఆయుష్య హోమం ప్రారంభించి పండితులను ఈవో రామచంద్రమోహన్ సత్కరించారు. 11గంటలకు ఆయుష్యహోమ పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు కదంబం ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈసందర్భంగా ఆలయాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. తూర్పు రాజగోపురాన్ని పచ్చదనంతో నింపారు. అనివేటి మండపం వెలుపల ఏర్పాటుచేసిన స్వామివారి ఆవిర్భావ దినోత్సవ పుష్పాలంకరణ సూచిక విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు ఆ ప్రాంతంలో నిలబడి తమ కెమెరాలలో స్వీయచిత్రాలను బంధించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటుచేసిన నృత్యప్రదర్శన, కోలాటం ఆకట్టుకున్నాయి.

డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్..

కౌన్సిల్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి): 2 డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, 5 అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిసున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్ర వరంలోని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయంలో పని చేయవలసి ఉంటుందన్నారు. దరఖాస్తులు తూ ర్పుగోదావరిజిల్లా న్యాయస్థాన అధికారిక వెబ్‌సైటు, డీఎల్‌ఎస్‌ఏ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కి క్రిమినల్ న్యాయశాస్త్రంలో ఏడేళ్ల అనుభవం, సెషన్స్ కోర్టులో కనీసం 20 క్రిమినల్ ట్రయల్స్ చేయడంతో పాటు మంచి సంభాషణ, లేఖన నైపుణ్యాలు ఉండాలన్నారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కోసం క్రిమినల్ 'లా'లో 0-3ఏళ్ల అనుభవంతోపాటు మంచి సంభాషణ, లేఖన నైపుణ్యాలు ఉండాలని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన న్యాయవాదులు ఈనెల 9న సాయంత్రం 5గంటలలోపుగా తమ దరఖాస్తులను డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో అందజేయాలన్నారు. సమాచారం https://east-godavari. dcourts. gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉందని పీడీజే తెలిపారు.

ఆవుల అక్రమ రవాణా

● ముగ్గురు వ్యక్తుల అరెస్టు



అక్రమంగా ఆవులను తరలిస్తున్న దృశ్యం

వై.రామవరం, ఆగస్టు 6: అల్లూరి జిల్లా వై.రామవరం మండలం నుంచి ఆవులను అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. వీరిలో మామిడి పవన్‌కుమార్ (వ్యాన్‌డ్రైవర్), మేక శ్రీను, సాసుం రాఘవరావుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. వ్యాన్ స్వాధీనం చేసుకుని ఆవులను, ఎద్దులను ఉలిగోగుల గోసంరక్షణ సమితికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీచ్‌లో

రూ.9.63 లక్షల మద్యం ధ్వంసం

సర్పవరం, ఆగస్టు 6: సూర్యారావుపేట బీచ్‌లో రూ.9.63 లక్షల విలువచేసే 2170 లీటర్ల మద్యం బాటిల్స్‌ను కాకినాడ డీఎస్పీ, సెబ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జేసీబీతో తొక్కించి పోలీసులు ధ్వంసం చేశారు. 261 కేసుల్లో ఈమద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని కాకినాడ డీఎస్పీ హనుమంతురావు తెలిపారు.

60వేల క్యూబిక్ మీటర్ల....

ఇసుక తరలింపు ఆవశ్యకతపై కలెక్టర్ దృష్టి

● రెవెన్యూ శాఖ సమాలోచనలు
● రంగంలోకి మైనింగ్ అధికారులు
● స్టాక్ పాయింట్ ఏర్పాటు చేస్తారా??





కూనవరం మొగ వద్ద తవ్వుతున్న ఇసుకను గుట్టలుగా వేస్తున్న దృశ్యం, మొగ వద్ద ఇసుక గుట్టలు

ఉప్పలగుప్తం, ఆగస్టు 6: కూనవరం సముద్రం మొగ వద్ద తవ్వకాల్లో ఇసుకను అక్కడే గుట్టలు వేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గుట్టలను తరలించాల్సిన ఆవశ్యకతను అధికారులు ముందుగానే గుర్తించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ సమస్య పరిష్కారానికి రెవెన్యూ, మైనింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కూనవరం సముద్రం మొగ వద్ద గత మూడు రోజులుగా ముమ్మరంగా తవ్వకాలు జరుగుతున్నాయి. తవ్విన ఇసుకను అక్కడే గుట్టలుగా వేస్తున్నారు. దీనివల్ల గాలులు, వర్షాలకు తవ్విన గండి తిరిగి మూసుకుపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను ముందుగానే డ్రెయిన్స్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. సర్వే ప్రకారం తవ్వకాల వల్ల దాదాపు 60వేల క్యూబిక్ మీటర్ల ఇసుక లభించే అవకాశమున్నట్టు అంచనా వేశారు. దీని వినియోగంపై జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులతో చర్చించినట్టు సమాచారం. అవసరాలకు ఇసుక మట్టి కావాలంటే ఎంతో వ్యయం చేయాల్సి రావడం, అవసరాలకు తగినంత ఇసుకమట్టి లభించకపోవడం తదితర అంశాలపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మొగ వద్ద లభించిన ఇసుకను అక్కడి నుంచి తరలించడంవల్ల మొగ మూత పడకుండా రక్షణ లభించడంతోపాటు ప్రభుత్వ అవసరాలకు ఇసుకను వినియోగించుకోవచ్చని నిర్ధారణకు వచ్చారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఇసుక తరలింపు బాధ్యతను ఆర్డీవోకు అప్పగించినట్టు సమాచారం. మైనింగ్ అధికారుల పర్యవేక్షణలో ఇసుక లభ్యత, ఎంత పరిమాణంలో మొగ ప్రదేశం నుంచి ఇసుక తరలించాలన్న అంశాలపై స్పష్టత తీసుకుని అనంతర చర్యలకు రెవెన్యూ యంత్రాంగం ప్రణాళిక రూపొందించనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వపరంగా అవసరమైన ప్రాంతాలకు ఇసుక తరలింపు లేదా అవసరమైనప్పుడు వినియోగించుకునేలా ప్రత్యేక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపకల్పన జరుగుతోంది. మొగ వద్ద ఇసుక గుట్టల అంశంపై ఆందోళన చెందవద్దని డ్రెయిన్స్ అధికారులు రైతులకు భరోసా ఇస్తున్నారు. మొగ తవ్వకాలు రైతులకు తక్షణం ఉపయోగపడేలా, ఎక్కువ కాలం మొగ మూతపడకుండా ఉండేలా కలెక్టర్ ఆదేశాలతో చర్యలు తీసుకుంటున్నామని డ్రెయిన్స్ అధికారులు చెప్పారు.

రాఖీ అవెన్యూస్ పేరుతో

రూ.16 కోట్లు టోకరా

● బాధితుల ఆవేదన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6: తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామంలో రాఖీ అవెన్యూస్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ చంద్రిక అవంతిక ఫేజ్-2 పేరుతో ప్లాట్లు కట్టించి ఇస్తామని తమవద్ద నుంచి సుమారు రూ.16 కోట్లు పైబడి పెట్టుబడిగా డబ్బులు కట్టించుకుని మోసం చేసిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో బాధితులు ధవళేశ్వరానికి చెందిన మృత్యుంజయరావు, చెన్నైకి చెందిన శ్రావణి, భీమవరానికి చెందిన నటరాజ్‌లు మాట్లాడారు. రాఖీ అవెన్యూస్ పేరుతో మొదటి వెంచర్‌ను విజయవంతంగా ఆ సంస్థ నిర్వాహకుడు వేణురామయ్య పూర్తిచేయడంతో తమతో పాటు సుమారు 80మంది రూ.10 నుంచి 30 లక్షల వరకు రెండో వెంచర్‌కు డబ్బులు కట్టామన్నారు. లెక్కప్రకారం ఈ ప్లాట్లను నిర్మించి ఇచ్చేందుకు 30నెలలు సమయం పడుతుందని చెప్పారని కాని 25 నెలలు పూర్తయినా అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో గతంలో తామంతా వేణురామయ్యను కలిసి ప్రశ్నించామన్నారు. అతను ఈ ప్రాజెక్టు కొంత ఆలస్యమవుతుందని, అయినా పూర్తిచేసి ఇస్తానని చెప్పాడని తెలిపారు. కొద్ది రోజుల తర్వాత మళ్లీ తాము వెంచర్ వద్దకు, కార్యాలయం వద్దకు వెళితే రామయ్య కుమార్తె, అల్లుడు ఉన్నారని, వారు కూడా త్వరలో నిర్మాణాలు చేపడతామని చెప్పారని తెలిపారు. ఇలా నాలుగేళ్ల తర్వాత పరిస్థితిచూస్తే రామయ్య, అతని కుమార్తె, అల్లుడు ఎవ్వరూ కనిపించడం లేదన్నారు. దీంతో తాము మోసపోయినట్టు గ్రహించి 2023 అక్టోబరు 30న అప్పటి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. కాని ఇంతవరకు తమకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. సొంత ఇంటి కోసం రూ.10నుంచి రూ.30లక్షల వరకు బ్యాంకు రుణాలు తీసుకుని డబ్బులు కట్టామని, ఇప్పుడు ఇటు ఇల్లు లేక అటు నెలనెలా వాయిదాలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఫేజ్-2 వెంచర్‌లో 130వరకు ప్లాట్‌లు నిర్మించాల్సి ఉందన్నారు. అమలాపురంలోను ఇదే తరహాలో మోసం చేశారని, ఇప్పుడు హైదరాబాద్‌లో మరో పేరుతో వెంచర్ ప్రారంభించినట్టు తెలిసిందన్నారు. చాలామంది ఉద్యోగులు, స్థానికేతరులు ఇక్కడ డబ్బులు కట్టి, ఇప్పుడు రిటైర్డ్ అయిపోయి కూడా బ్యాంకు రుణాలు కట్టుకుంటూ చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తమలా మరొకరు మోసపోకూడదని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. తమ డబ్బులు ఇప్పించాలని కోరారు. సమావేశంలో మోహన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మరింత భద్రత



● సముద్రంలో చేపల వేటకు వెళ్లిన వారికి రక్షణకు నిర్ణయం
● తొలి దశలో 200 మెకనైజ్డ్ బోట్లకు ట్రాకింగ్ డివైజ్‌లు అమరిక
● రూ.40వేలు విలువైన ఒక్కో పరికరం పూర్తి సబ్సిడీతో అందజేత



ట్రాకింగ్ డివైజ్ పరికరం నమూనా

కాకినాడ సిటీ, ఆగస్టు 6: సముద్రంలో చేపల వేటకు మత్స్యకారులు ఉపయోగించే బోట్లకు ఇస్రో సాంకేతిక సహకారంతో శాటిలైట్ కమ్యూనికేషన్‌తో పాటు ట్రాకింగ్ డివైజ్ పరికరాలను అమర్చేందుకు జిల్లా మత్స్య శాఖ సన్నాహాలు చేస్తోంది. సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇందుకు మార్గనిర్దేశనం చేయడంతో పాటు వంద రోజుల ప్రోగ్రాం ప్రకటించారు. అందుకనుగుణంగా కాకినాడ జిల్లా పరిధిలోని మెకనైజ్డ్ బోట్లు (పెద్ద బోట్లు)కు ఈ పరికరాలు అమర్చేందుకు జిల్లా మత్స్యశాఖ అధికారులు సర్వే చేయించారు. జిల్లావ్యాప్తంగా 395 మెకనైజ్డ్ బోట్లు ఉండగా తొలి దశలో 200 బోట్లకు ఈ పరికరాలు అమర్చనున్నారు. ఒక్కో ట్రాకింగ్ డివైజ్ పరికరానికి రూ.40వేలు ఖర్చు అవుతుండగా, నూరుశాతం సబ్సిడీతో ఉచితంగా అందించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ గ్రాంటును విడుదల చేయనున్నారు. మెకనైజ్డ్ బోట్లకు ట్రాకింగ్ డివైజ్ అమర్చడంవల్ల తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సముద్రంలో బోటు ఎక్కడ ఆగిపోయిందో, వేటకు వెళ్లిన మత్స్యకారులు ఎన్ని నాటికల్ మైళ్ల దూరంలో చిక్కుకున్నారో కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందుతుంది. తద్వారా సహాయక చర్యలు చేపట్టి సముద్రంలో చిక్కుకుపోయిన మత్స్యకారులను రక్షించే వీలు కలుగుతుంది. అదేవిధంగా సముద్రంలో చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులు తీరం నుంచి ఎన్ని నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నారో, ఏ దిక్కున ప్రయాణిస్తున్నారో వంటి సమాచారం తెలుసుకో గలుగుతారు. సముద్రంలో బోటు ఆగిపోయి ప్రమాదంలో పడినప్పుడు సమీప బోట్ల మత్స్యకారులతో మాట్లాడి సహాయం పొందే వీలుంటుంది. దీనిపై మత్స్యశాఖ జిల్లా అభివృద్ధి అధికారి కరుణాకరరావును వివరాలు కోరగా.... బోట్లకు ట్రాకింగ్ డివైజ్ అమర్చేందుకు కార్యాచరణ చేపట్టామన్నారు. తొలి దశలో 200 మెకనైజ్డ్ బోట్లకు ఈ పరికరాలు అమరుస్తామని, రెండు నెలల్లో ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.

తల్లి మందలించడంతో యువకుడి ఆత్మహత్య



వై.రామవరం, ఆగస్టు 6: సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడని తల్లిమందలించడంతో మనస్తాపానికి గురైన ఓ గిరిజన యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన వై.రామవరం మండలం యర్రంరెడ్డిపాలెం పంచాయతీ గండెంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 4వతేదీన సెల్‌ఫోన్ పోగొట్టుకున్న కుమారుడిని తల్లి మందలించడంతో నెరం సంతోష్‌కుమార్(18) అనే గిరిజన యువకుడు గడ్డిమందు తాగాడు. తొలుత అడ్డతీగల ప్రభుత్వాస్పత్రి కి అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మంగళవారం మృతదేహాన్ని కుటుంబీలకు అప్పగించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాము కాటుకు వ్యక్తి మృతి



మృతి చెందిన మోసం తమ్మయ్య

చింతూరు, ఆగస్టు 6 : పాము కాటుకు వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం ఏజీ కొడేరులో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఏజీ కొడేరుకు చెందిన మోసం తమ్మయ్య (76) తన నివాస గృహంవద్దనే పాము కాటువేసింది. దీంతో తమ్మయ్యను హుటాహుటిన చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగానే తమ్మయ్య మృతి చెందాడు.

బిడ్డ ప్రాణంకోసం నాటు మందు తీసుకున్నా

● వాగు పొంగడంతో నాటుమందే శరణ్యమని భావించాం
● చివరకు బిడ్డ ప్రాణాలు నిలబెట్టుకోలేకపోయాం ● ఓ తల్లి ఆవేదన



పాప తల్లిదండ్రులు మహేష్, రమ్య

చింతూరు, ఆగస్టు 6: జలుబు, దగ్గుతో బిడ్డ ఊపిరి పీల్చుకోలేని స్థితి. ఆసుపత్రికి వెళదామంటే ఎడతెరపిలేని వర్షం, వాగు పొంగి దారి కరువైంది. ఏం చేయాలో అర్థం కాలేదు. ఎలాగైనా బిడ్డ ప్రాణాలు నిలుపుకోవాలనుకున్నాం. గత్యంతరం లేక నాటుమందుని ఆశ్రయించాం. అయినా బిడ్డను కాపాడు కోలేకపోయాం. అల్లూరిసీతారామరాజు జిల్లా చింతూరు మండలం వంకగూడెంనకు చెందిన మహేష్, రమ్యల నాలుగు నెలల పసిబిడ్డ సోమవారం భద్రాచలంలో మృతి చెందిన విషయం విధితమే. మహేష్, రమ్యలు తెలిపిన వివరాల మేరకు .. ఈనెల ఒకటోతేదీ నుంచి తమ నాలుగు నెలల బిడ్డ దగ్గుతో బాధపడుతోంది. ఇక రాత్రి సమయంలో ఊపిరి పీల్చు కోలేనిస్థితి. ఆసుపత్రికి తీసుకెళ్దాం అనుకుంటే ఏడుగు రాళ్ళపల్లి ప్రాథమిక వైద్యశాలకు వెళ్లాలి. ఎడతెరపిలేని వర్షం, వంక గూడెం నుంచి ఏడుగురాళ్ళపల్లి వెళ్లాంటే మార్గమధ్యంలో ఉన్న వాగు దాటాల్సిందే. మరో మార్గమే లేదు. దీంతో ఆ ప్రయత్నం చేయలేని పరిస్థితి. ఏం చేయాలో అర్థం కాలేదు. బిడ్డ ఊపిరి పీల్చుకోవడంలో పడుతున్న అవస్థ పెరుగుతూపోతోంది. చేసేదేమీలేక నాటు వైద్యుడిని ఆశ్రయించాం. ఎలాగైనా బిడ్డను కాపాడుకోవాలనుకున్నాం. ఆ నాటు వైద్యుడు ఇచ్చిన పసర మందుని బిడ్డకు పట్టిచ్చాం. తల్లిపాల ద్వారా బిడ్డకు మందు అందుతుందన్న ఆశతో నేను (తల్లి రమ్య) కూడా నాటు మందు తీసుకున్నా. అయినా బిడ్డ పరిస్థితి మెరుగుప డలేదు. ఆదివారం రాత్రి వాగు ఉధృతి తగ్గడంతో కాలినడకన ఏడుగు రాళ్ళపల్లి ప్రాథమిక వైద్యశాలకు వెళ్లాం. అక్కడి నుంచి వైద్యులు చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చింతూరు నుంచి భద్రాచలం ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. చివరకు బిడ్డ ప్రాణాలు పోయాయంటూ ఆ తల్లిదండ్రులు రోధిస్తున్నారు.

చిన్నారుల మృతిపై నిర్లక్ష్యాన్ని గుర్తించాం

● బాధ్యులపై చర్యలు
● ఆర్‌ఎంపీలు స్థాయిని మించి వైద్యం చేయవద్దు
● నాటు మందు వినియోగంపై అవగాహన కల్పిస్తాం
● చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు, ఆగస్టు 6: వరుసగా చిన్నారులు మృతి చెందు తున్న ఘటనలపై అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య స్పందించారు. వీటిలో రెండు ప్రదేశాలలో చోటుచేసుకున్న నిర్లక్ష్యాన్ని గుర్తించామన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోనున్నట్లు పీవో పేర్కొన్నారు. చింతూరు మండలంలో గడచిన ఎనిమిది రోజుల వ్యవధిలో ఐదుగురు చిన్నారులు మృతి చెందిన విషయం విధితమే. ఈ ఘటనలపై పీవో ఆరోగ్యశాఖతోపాటు రహస్యంగా మరో శాఖతో క్షేత్ర స్థాయి విచారణ చేయించారు. ఈ క్రమంలో మంగళవారం పీవో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించా రు. చిన్నారుల మృతికి కారణాలను తెలుసుకున్నామని ఐదు మరణాలలో రెండు మరణాలు నాటు మందు వాడడంవల్ల విషయం వెల్లడైందన్నారు. మరొక మరణం విషయంలో ఆర్‌ఎంపీ వైద్యుడి అరకొర వైద్యం కూడా కారణమే కావచ్చన్న నిర్ధారణకు వచ్చే అవకాశం ఉందన్నారు. రెండు ప్రదేశాలలో చిన్నారుల ఆరోగ్య స్థితిగతులపై ఆరోగ్యశాఖకు చెందిన స్థానిక సిబ్బంది స్పందించకపోవడంతో సకాలంలో వారికి వైద్యం అందించే ప్రక్రియకు దూరం కావాల్సిన పరిస్థితిని గుర్తించా మన్నారు. దీంతో ఆ సిబ్బందిపై ఒకటి రెండు రోజుల్లో చర్యలు తీసుకోనున్నట్లు పీవో తెలిపారు. చింతూరు డివిజన్ వ్యాప్తంగా ఏఎన్‌ఎంల స్థానచలన చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నామ న్నారు. వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్యం అందించే ప్రక్రియలో భాగంగా ఐటీడీఏలో టోల్‌ఫ్రీ నెంబరు కేటాయిస్తున్నామన్నారు. దోమతెరలు, ఫాగింగు తదితర పారిశుద్ధ్యం చర్యలు తీసుకుంటున్నామన్నారు. చింతూరు సీహెచ్‌సీకి రెడ్‌క్రాస్ నుంచి వెంటిలేటరు సదుపాయం ఉన్న అంబులెన్సును తీసుకువస్తామన్నారు. డివిజన్ వ్యాప్తంగా వివిధ శాఖలతో కూడిన గ్రామసభలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహనతో ఆయా ప్రాంతాలలో తీసుకోవాల్సిన చర్యలపై ఒక నివేదిక రూపొందించనున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏరియా ఆసుపత్రి సూపరిం టెండెంట్ డా.కోటిరెడ్డి, చిన్నపిల్లల ప్రత్యేక నిపుణులు డాక్టర్ హర్ష, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

సకాలంలో రేషన్ సరఫరాకు చర్యలు

● రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

దేవీపట్నం, ఆగస్టు 6: ప్రతీనెలా తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరఫరాచేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం దేవీపట్నం మండలం ఇందుకూరులో రేషన్‌షాపును సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీచేసి కార్డుదారులతో మాట్లాడారు. ఏజెన్సీలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు ఎక్కడికక్కడ రేషన్ సరఫరా చేస్తామన్నారు. రేషన్ సరఫరాలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ చలపతిరావు, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, జీసీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సత్కారం


తహశీల్దార్‌ను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

వరరామచంద్రాపురం, ఆగస్టు 6: గోదావరి వరదల సమయంలో వరద బాధితులకు అండగా నేనున్నాను అంటూ సేవలందించిన తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్‌కు, రెవెన్యూ సిబ్బందికి మంగళవారం మండల టీడీపీ, జనసేన నాయకులు, ప్రజాప్రతినిధులు సత్కారం చేశారు. ఈసందర్బంగా జడ్పీటీసీ సభ్యులు వాళ్ళ రంగారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆచంటి శ్రీను, సీనియర్ నాయకులు ముత్యాల రామారావు, జనసేన మండల అధ్యక్షుడ ములకాల సాయికృష్ణ మాట్లాడుతూ తూర్పు గోదావరి వరదల సమయంలో వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సౌకర్యాలు కల్పించడమే కాకుండా ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యం, నిత్యావసర సరకులు సక్రమంగా అందేలా జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. గుర్రంపేట గ్రామశివారు లో వరద ప్రవాహంలో చిక్కుకున్న వారిని కాపాడడమే కాకుండా, మండలం చుట్టూ వరదనీరు ఉన్న సమయంలో వీఆర్‌పురం గ్రామానికి చెందిన మహిళ పురిటినొప్పులతో బాధపడుతున్న ఆమె ను అర్ధ రాత్రి సమయంలో బోట్‌ద్వారా కోతులగుట్ట ఆసుపత్రికి పంపి ంచారు. వరదల సమయంలో ఆయన చేసిన సేవలకు అభినందిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలకు సీపీఐ బృందం పరామర్శ

ఎటపాక, ఆగస్టు 3: గోదావరి వరద బాధిత కుటుంబాలను మంగళవారం సీపీఐ బృందం పరామర్శించింది. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకరి విష్ణు ఆధ్వర్యంలో గన్నవరం, భూపతిరావుపేట గ్రామాల్లో ఇటీవల వరద ముంపునకు గురైన కుటుం బాలను పరామర్శించి, వరదతో కలిగిన నష్ట వివరాల ను అడిగి తెలుసుకున్నారు. వరదతో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ఇళ్లకు రూ.10 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొన్ని గ్రామాల్లో రైతులకు పశువుల దాణా ఇవ్వలేదని, గుర్తించి దాణా పంపిణీ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి శైలజ, మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, ఎంపీటీసీ కంటే రాజు, పసుపులేటి ముత్తయ్య, సోయం కామేశ్వరరావు, తది తరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఆగస్టు6: జెన్‌కో సీలేరు కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు సీఈకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్ కార్మికుల్లో విద్యార్హతలు, సాంకే తిక నైపుణ్యా న్ని బట్టి సెమి స్కిల్డ్ కార్మికులుగా గుర్తించాలని కోరారు. తమకు వైద్య సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న తమకు రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా కనీసం రూ.10లక్షల బెనిఫిట్స్‌ను ఇవ్వాలని కోరా రు. సీఈని కలిసిన వారిలో శ్రీను, సన్యాసిరావు, మల్లేష్, రాజా పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

● సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు

రాజవొమ్మంగి ఆగస్టు 6: ప్రజలు తమ హక్కులపై అవగాహన కలిగిఉండాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిట సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు అన్నారు. మంగళవారం రాజవొమ్మంగి మండలంలోని అమీనాబాద్ కాలనీలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. సమావేశంలో ప్రకాష్ బాబు మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కుల కోసం పోరాడే నిరుపేదలకు ఉచితంగా న్యాయ సహా యం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. గిరిజన ప్రాంతంలో బాల్యవివాహాలు, బాలకార్మికులు, బహుభార్యత్వం లేకుండా నివారించాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు అన్నారు. ఆయనతో అమీనాబాద్ సర్పంచ్ కె.వెంకటలక్ష్మి, న్యాయవాది కె.ఎస్.వి.రమణ, సోషల్ వర్కర్ గౌరీశంకర్, జడ్డంగి ఎస్ఐ రఘునాధరావు ఉన్నారు.

ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

● ఐటీడీఏ పీవో సింహాచలం


వైద్యసేవలపై అడిగి తెలుసుకుంటున్న పీవో సింహాచలం

రంపచోడవరం, ఆగస్టు 6: ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాల న్నారు. ఒక మోడల్ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రిని తరచుగా పరిశీలించడం జరుగుతుందని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్యాధికారులు వెంకట ఇందిరా, కల్పన, ప్రేమ్‌కుమార్, కిరణ్, కె.సుధాకర్, సుజన, మోబినా పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన రంప ఎమ్మెల్యే శిరీష



రంపచోడవరం, ఆగస్టు 6: రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మంగళవారం మంగళగిరి టిడిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తన నియోజకవర్గంలోని పలు సమస్యలను హోంమంత్రికి వివరించారు. గత రెండునెలలుగా నియోజకవర్గ స్థాయిలో చేసిన పలు పర్యటనలలో తన దృష్టికి వచ్చిన పలు ముఖ్య సమస్యలను హోంమంత్రికి వివరించారు. ఎమ్మెల్యే శిరీషతో పాటు నయోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, ఆగస్టు 6: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అన్ని గిరిజన తెగలతో ఘనంగా నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు గిరిజన సంఘాలు, నాయకులతో సమావేశం ఏర్పా టుచేసి అభిప్రాయాలు తెలుసుకున్నారు. శుక్రవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆదివాసీ జెండా ఎగురవేస్తామన్నారు. ఏడుతెగలకు సంబంధించిన ఏడుగురు పెద్దలను సన్మానిస్తామన్నారు. ఏజెన్సీ ప్రతి మండలంలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించేందుకు మండలానికి రూ.10వేలు కేటాయించనున్నట్లు తెలిపారు. గిరిజన సంఘాలు, నాయకులు సమన్వయంతో గిరిజనాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కంగల శ్రీనివాసరావుదొర, వెదుళ్ళ లచ్చిరెడ్డి, గొర్లె చిన నారాయణ రావు, కడబాల సూరిబాబు, కృష్ణ, తీగల బాబురావు, మంగిరెడ్డి, కత్తుల అదిరెడ్డి, మడకం వరప్రసాద్‌దొర, బి.వరప్రసాద్, వాస సత్యనారా యణ, ఎం.వెంకటేశ్వరరావు, ఎల్.వెంకటేశ్వరరావు, కింటుకూరి లక్ష్మణరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, ఐటీడీఏ పరిపాలనాధికారి డీఎన్వీ రమణ, ఏపీడీ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇర్లపల్లి పాఠశాలను పరిశీలించిన డీఈవో

రంపచోడవరం, ఆగస్టు 6: మండలంలోని ఇర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజిరావు మంగళవారం పరిశీలించారు. ఆయన విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫాం, అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యా బోధన తదితర అంశాలపై పరిశీలించారు. కార్యక్రమంలో ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అందరి ఇళ్లపై జాతీయ జెండా ఎగరాలి'

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 6: ఈ నెల 15న అందరి ఇళ్లపై జాతీయ జెండాలు ఎగురవేసేలా బీజేపీ కేడర్ అంతా పనిచేయాలని పార్టీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్ అన్నారు. మంగళవారం హర్ ఘర్ తిరంగాపై రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో పార్టీపరంగా చేయవలసిన కార్యక్రమాలపై చర్చించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, కాశీ విశ్వనాధరాజు, కోడూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చారిత్రక ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి కృషి

» ప్లే గ్రౌండ్ మరింత సమర్థవంతంగా వినియోగం

» ఆర్ట్స్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్


ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను సందర్శిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 6: చారిత్రక ఆర్ట్స్ కళాశాలను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను సందర్శించారు. తరగతి గదులు, లైబ్రరీ పరిశీలించారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కేతో ప్రత్యేకంగా సమావేశమై కళాశాలకు సంబంధించిన పలు అంశాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం కళాశాల గ్రౌండును స్టేడియం నిర్మాణం పేరుతో లాక్కోవడానికి ప్రయత్నించగా విద్యార్థులు అడ్డుకున్నారన్నారు. కళాశాల నుంచి ఎంతోమంది జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించే విధంగా ఫుట్‌బాల్, ఇతర క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు సరైన ప్రోత్సాహాన్ని గత ప్రభుత్వం ఇవ్వలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో విద్యతో పాటు క్రీడల్లోను విద్యార్థులు రాణించే విధంగా ప్రోత్సాహం అందిస్తామన్నారు. కళాశాల ప్లే గ్రౌండును మరింత అభివృద్ధి చేస్తామని, పూర్వ విద్యార్థుల సంఘం, ఇతర సంస్థల సహకారంతో కళాశాలకు వైభవాన్ని తీసుకొస్తామన్నారు. ఇప్పటికే నగరంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోసం ఖేలో ఇండియాతో సహకారం తీసుకునే విధంగా ఎంపీ పురందేశ్వరి చర్యలు తీసుకుంటున్నారన్నారు. దాతల సహకారంతో తరగతి అదనపు గదులు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల లైబ్రరీలో 16వ శతాబ్దం నుంచి నేటి వరకూ గత చరిత్ర వైభవాన్ని తెలుసుకునే విధంగా పుస్తకాలను అందుబాటులో ఉంచి సంరక్షించడం, వాటిని డిజిటలైజ్ చేసే ప్రక్రియ చేపట్టడం ప్రశంసనీయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశీ నవీన్‌కుమార్, కుడుపూడి సత్తిబాబు, రవి యాదవ్, అలూమ్ని అధ్యక్షుడు మాధవ్, గద్దే సుధాకర్, భార్గవ్, వరప్రసాద్, విజయలక్ష్మి, బేబి, శివకుమార్, రేవతి, ఎం.సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం

» కూటమి నాయకుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్ల


మురమండలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, ఆగస్టు 6: అభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల పాలన సాగుతోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. మంగళవారం మురమండ అప్పారావుపేటలోని కళ్యాణ మండపంలో జరిగిన కూటమి నాయకుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కళ్యాణ మండపం అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు తమ వద్దకు తీసుకువస్తే వాటికి ప్రతిపాదనలు చేసి గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే గోరంట్లను కూటమి నాయకులు ఘనంగా సత్కరించి వెంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గోరంట్ల విచ్చేసి విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ప్రభుత్వ కళాశాలలు అభివృద్ధి చెందే విధంగా బోధించి విద్యార్థుల భవిష్యత్తుకు అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో ప్రత్తిపాటి రామారావుచౌదరి, దేవళ్ల రాంబాబు, వట్టికూటి జానకీరామయ్య, నల్లూరి రామకృష్ణ, గద్దే చిన్నా, గన్ని బాబి, చెల్లుబోయిన శ్రీను, చిట్టూరి అమ్మిరాజు, ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంబు కాలువకు గండి

50 ఎకరాల్లో పంట మునక

గోకవరం, ఆగస్టు 6: మండలంలోని గాదెలపాలెం గ్రామ శివారున గుంబు కాలువకు గండి పడి సుమారు 50 ఎకరాల పంట నీట మునిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీటితో పాటు, గాదెలపాలెంలోని ఇసుకపల్లి వారి చెరువు, తంటికొండ సమీపంలోని తాళ్ల చెరువుల కళంగిల పైనుంచి నీరు పొంగిపొర్లి గుంబు కాలువ గుండా ప్రవహిస్తోంది. దీంతో బలహీనంగా ఉన్న గుంబు కాలువ గుట్టుకు (బదిరెడ్డి అప్పన్నదొర పొలం వద్ద) గండి పడింది. దీంతో కాలువ సమీపంలో సుమారు 50 ఎకరాల వరి పంట పూర్తిగా నీటి మునిగిందని బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. పంటను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా గండి పడిన ప్రాంతంలో 300 ఇసుక బస్తాలతో పూడ్చే ప్రయత్నం చేసినప్పటికీ పంటను కాపాడుకోలేక పోయామని గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికి రెండు పర్యాయాలు గుంబు కాలువ గండి పడినట్లు రైతులు తమ ఆవేదనను వెలిబుచ్చుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులు అందుబాటులో లేకపోవడంతో మండల వ్యవసాయాధికారులకు వినతిపత్రం అందజేసినట్లు బాధిత రైతులు తెలిపారు.

మానసికారోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి

డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 6: మానసిక ఆరోగ్య సమస్యలపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ మానసిక ఆరోగ్య అవగాహన దినం సందర్భంగా మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో వైద్యులకు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడం, సంబంధిత వైద్య సేవలు అందించడం ఆరోగ్యరంగంలో ప్రధాన విషయమని స్పష్టం చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్, డాక్టర్ షమ్మీ కుమార్, మౌనిక, సూపరింటెండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

జక్కంపూడి రామ్మోహనరావు జయంతి

రాజానగరం, ఆగస్టు 6: దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు జయంతిని మండలంలో పలుచోట్ల మంగళవారం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్బంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జక్కంపూడి ఎమ్మెల్యేగా, మంత్రిగా నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గుర్తుచేశారు. కార్యక్రమాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. వెలుగుబందలో జరిగిన కార్యక్రమంలో జక్కంపూడి చిత్రపటం వద్ద వైపీసీ నాయకులు నివాళులర్పించారు.



దివాన్‌చెరువు: శ్రీకృష్ణపట్నంలో జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముఖ్యఅతిథిగా విచ్చేసి రామ్మోహనరావు విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వాసంశెట్టి పెదవెంకన్న, మండారపు వీర్రాజు, కుందేటి ప్రసాద్, కొల్లి వీర్రాజు, ప్రగడ చక్రి, కందుల శ్రీనాథ్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: కంబాలచెరువు సెంటర్‌లో జక్కంపూడి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మేడపాటి షర్మిళారెడ్డి, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లు పూలమాలలతో నివాళులర్పించారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కాలనీలోని ప్రియదర్శిని చెవిటి, మూగ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే 49వ డివిజన్ సుబ్బారావునగర్‌లో మాసా రామ్‌జోగ్ ఆధ్వర్యంలో జక్కంపూడి జయంతి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆకుల వీర్రాజు, సింధు సహస్ర, జక్కంపూడి ప్రకాష్, సూర్యప్రభావతి ,కొమ్మల సాయి. సూర్య పాల్గొన్నారు.

కడియం: బుర్రిలంక ప్రాథమిక పాఠశాలలో వైసీపీ నాయకులు, కొత్తపల్లి శివాజీ, కొత్తపల్లి మూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పిం చారు. గిరజాల బాబు, పల్ల సుబ్రహ్మణ్యం, కొండపల్లి పట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కొవ్వొత్తుల ర్యాలీ

గోకవరం, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మండలంలోని రంపయర్రంపాలెంలో మాలలు మంగళవారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. సుమారు 50 మంది యువకులు మాలపేట ప్రధాన కూడలిలో కొవ్వొత్తులు చేతబట్టుకొని జై భీమ్ వర్గీకరణను రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకొని నిరసన తెలిపారు.

గోకవరం ఎస్ఐగా పవన్‌కుమార్



గోకవరం, ఆగస్టు 6: గోకవరం ఎస్ఐగా వి.నాగవెంకట పవన్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజానగరం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై గోకవరం వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన కూన నాగరాజు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన పవన్‌కుమార్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు.

బంగారు వరలక్ష్మి కానుకకు రిజిస్ట్రేషన్లు

కోరుకొండ, ఆగస్టు 6: బంగారు వరలక్ష్మి కానుకకు శ్రీరంగపట్నంలో నిర్వహించిన రిజిస్ట్రేషన్లలో 2020 మంది మహిళలు పేర్లు నమోదు చేసుకున్నారని విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 8న పంచాయతీ గోడౌన్ వద్ద లక్కీడ్రా తీస్తామన్నారు.

శ్రీరంగపట్నంలో బురద కాలువ వరద

గ్రామాన్ని సందర్శించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్


శ్రీరంగపట్నంలో వరదను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీశివజ్యోతి

కోరుకొండ, ఆగస్టు 6: శ్రీరంగపట్నంలోకి మంగళవారం మరోసారి బురద కాలువ వరద నీరు విరుచుకు పడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బురద కాలువ ఉధృతి పెరిగింది. దీంతో శ్రీరంగపట్నం జంక్షన్ వద్ద వరద నీరు పొంగి ప్రవహించి గ్రామంలోకి చేరింది. దీనికితోడు సూరంపాలెం రిజర్వాయర్ నుంచి మిగులు జలాలను దిగువకు వదలడంతో బురద కాలువ ఉగ్రరూపం దాల్చింది. విషయం తెలుసుకున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, రాజమహేంద్రవరం ఇన్‌చార్జి ఆర్డీవో కె.లక్ష్మీశివజ్యోతి గ్రామాన్ని సందర్శించి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, 24గంటలు పాటు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. నెల రోజుల వ్యవధిలో మూడు సార్లు బురద కాలువ ఉప్పొంగి శ్రీరంగపట్నంలోకి ప్రవేశించిందని, ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని గ్రామస్థులు.. డిప్యూటీ కలెక్టర్‌ను కోరారు.

అధికారుల గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



మండల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల

సీతానగరం, ఆగస్టు 6: మండల సర్వసభ్య సమావేశానికి అధికారుల గైర్హాజరుపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు గైర్హాజరై కింది స్థాయి ఉద్యోగులను సమావేశానికి పంపించడం సరికాదన్నారు. ఇది పునరావృతమైతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ ఏసురాణి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని, పంచాయతీ సిబ్బంది తమతో సమన్వయం కావాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంఈవో స్వామినాయక్, జడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు సత్యం మదన్‌బాబు, ముదునూరి సురేష్‌రాజు, సీతానగరం సర్పంచ్ కోండ్రపు ముత్యాలు పాల్గొన్నారు.

ఘనంగా కన్నమాంబ జాతర

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 6: స్థానిక ఇన్నీసుపేట 27వ వార్డులో శ్రీ క న్నమాంబ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అధిక పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారికి పూజలు, వ్రతాలు చేశారు. మంత్రి కందుల దుర్గేష్ కన్నమాంబను దర్శించుకొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

బీసీ బిల్లుకు సహకరించిన వారినే ప్రధానిని చేయాలి

ఢిల్లీ మహాధర్నాలో జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6: బీసీ బిల్లుకు ఎవరైతే సహకరిస్తారో వారిని ప్రధాన మంత్రిని చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత అన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నిర్వహించిన మహాధర్నాలో తమ నాయకుడు ఆర్.కృష్ణయ్యతో పాటు ఉపాధ్యక్షుడు గుజ్జు సత్యం ఆధ్వర్యంలో నిరసన తెలిపామని ఆమె చెప్పారు. రాజమహేంద్రవరానికి చెందిన ఆమె మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు కల్పించడంపై కోర్టు అభ్యంతరం చెప్పడం అన్యాయమన్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ48లక్షల కోట్లలో బీసీ సంక్షేమానికి రూ.2400 కోట్లు మాత్రమే కేటాయించడం బాధాకరమన్నారు. ఢిల్లీలో ధర్నా ద్వారా కేంద్రానికి తమ నిరసన తెలిపామన్నారు. కార్యక్రమంలో బీద మస్తాన్‌రావు, బాబురావు, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు, బీసీ నాయకులు గుజ్జు కృష్ణ, నీలం వెంకటేష్, లాకా వెంగళరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లెపల్లి సుభాషిణి, నాయకులు తదితరులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

రైతులకు 8 వేల మొక్కలు అందజేత

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 6: డాబర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి జీవంతి వెల్ఫేర్ చారిటబుల్ సంస్థ ఆర్థిక సహకారంతో, జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ వారు ట్రీస్ ఔట్‌సైడ్ ఫారెస్ట్ పథకంలో భాగంగా మంగళవారం మల్లంపల్లిలో పలు రకాలైన సుమారు 8 వేల మొక్కలను రైతులకు అందించారు. ఈ కార్యక్రమం ద్వారా అడవి వెలుపల ఉన్న చెట్లు, అడవి వనరులపై ఒత్తిడిని తొలగించి, వ్యవసాయ భూములను కాపాడుతాయని, పర్యావరణంపై హానికరమైన ప్రభావం తగ్గించి, ఆహార సరఫరా పెంచి, ఆదాయాన్ని అందిస్తాయని సొసైటీ ప్రెసిడెంట్ ఎంఎస్ఆర్. కిశోర్, డాబర్ ఇండియా ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.అప్పలరాజు అన్నారు. కార్యక్రమంలో టోఫీ జిల్లా అధికారులు, జనకళ్యాణ్ సిబ్బంది పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి మొక్కలు

కడియం, ఆగస్టు 6: వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి కడియం గ్రామానికి చెందిన రైతు వెన్నపు మణికంఠస్వామి సుమారు రూ.50 వేల విలువైన మొక్కలను ఉచితంగా పంపించారు. ప్రతీ శనివారం దర్శనానికి వెళ్ళే తాను.. తన మోక్షిత్ నర్సరీ నుంచి స్వామి ఆలయానికి ఉపయోగపడే విధంగా మామిడితోపాటు కొన్ని ఫల, పుష్ప జాతుల మొక్కలు పంపించినట్లు తెలిపారు..

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా పాఠశాల విద్యాధికారి వాసుదేవరావు

రాజమహేంద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం 2024-25కి సంబంధించి డిసెంబరు 8న నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానించారని జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సదుపాయం లేకుండా ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి విద్యనభ్యసిస్తున్న వారు అర్హులన్నారు. కుటుంబ సంవత్సరాదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్టీ రూ.50 పరీక్షా రుసుంతో సెప్టెంబరు 10వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఫీజును ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. పూర్తి వివరాలు www.bse.ap.gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉన్నాయని.. లేదా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

మహిళా హాస్టల్స్ బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

డీఆర్వోకు ఏఐఎస్ఎఫ్ వినతి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 6: జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న అసౌకర్యాల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్, ఇతర నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ భద్రత దృష్ట్యా మహిళల హాస్టల్స్ బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. గత ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టళ్లను గాలికి వదిలేసిందని, దీంతో హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ ఛార్జీలు తక్షణమే విడుదల చేయాలని, హాస్టళ్ల నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రధానంగా నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు, రాజమహేంద్రవరంలో పలు హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరాయని, వీటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎండ్రపాటి సునీల్, వివేక్, అనీష్, జీవన్, రాజు, జయంత్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపల్లి సర్పంచ్‌పై దాడి

ఆసుపత్రికి తరలింపు.. పరస్పర కేసులు


విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ అంబికాప్రసాద్

బిక్కవోలు, ఆగస్టు 6: ఇళ్లపల్లి సర్పంచ్ లొల్ల భద్రంపై సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చారని రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ అంబికాప్రసాద్ తెలిపారు. భద్రాన్ని చెరువుల విషయంపై మాట్లాడాలని ఇంటి నుంచి రాత్రి 8గంటలకు రప్పించి అతనిపై దాడి చేసి కారులో తీసుకుపోవడానికి ప్రయత్నించగా గ్రామస్థులు వచ్చి అడ్డుకున్నారు. దీంతో నలుగురు వ్యక్తులు రెండు బైక్‌లపై రంగంపేట మండలం మర్రిపూడి వైపు వెళ్లారు. విషయం తెలిసిన బిక్కవోలు ఎస్ఐ పి.బుజ్జిబాబు రంగంపేట ఎస్ఐకు తెలియపర్చగా వారిని మర్రిపూడిలో అదుపులోకి తీసుకున్నారు. వారికి కూడా గాయాలు కావడంతో పెద్దాపురం ఆసుపత్రికి, గాయాల పాలైన భద్రాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. భద్రం ఫిర్యాదు మేరకు బిక్కవోలు పోలీసులు కేసు నమోదు చేశారు. తమను గాయపర్చారంటూ నలుగురు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుపై రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విషయం తెల్సిన వెంటనే తాను సోమవారం రాత్రి బిక్కవోలు పోలీసులతో ఇళ్లపల్లి వెళ్లి రాత్రంతా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూశామని డీఎస్పీ చెప్పారు. ప్రస్తుతం ఇళ్లపల్లిలో ప్రశాంత వాతావరణం వుందన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలకు లోబడి నడచుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏ, వైద్యారోగ్యశాఖ సమన్వయంతో ఎస్‌టీ మహిళా హాస్టల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డి.అలేఖ్య, స్టాఫ్‌నర్స్ కె.శారద, ల్యాబ్ టెక్నీషియన్ వై.బాలదుర్గ, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు కె.బేబీ, కె.కరుణ తదితరులు పాల్గొన్నారు.


అన్నపూర్ణమ్మపేట ఆర్‌వోబీ పరిశీలన

రాజమహేంద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అన్నపూర్ణమ్మపేటలోని రైల్వే ఆర్‌వోబీ నిర్మాణానికి అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ నెల 3న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రైల్వే ఉన్నతాధికారులు రైల్వే స్టేషన్‌ని పరిశీలించి సమగ్రంగా చర్చించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా రైల్వే అధికారులు రంగంలోకి దిగారు. గతిశక్తి(రైల్వే బోర్డు) నుంచి వచ్చిన సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్‌తో కూడిన బృందం నగరపాలక సంస్థ అధికారులతో కలిసి అన్నపూర్ణమ్మపేట ఆర్‌వోబీ ప్రదేశాన్ని సందర్శించి సర్వే నిర్వహించారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ---
సూర్యామినీ	: రాయన్
సూర్యాప్యాలస్	: బడ్డీ
స్వామి	: శివం భజే
శివజ్యోతి	: అలనాటి రామచంద్రుడు
అనుశ్రీ(సాయికృష్ణ)	: శివం భజే
రాజా	: తిరగబడరా సామి
ఊర్వశి	: ఉషా పరిణయం
రంభ	: ఎటో వెళ్లిపోయింది మనసు
మేనక	: విరాజీ
అప్సర	: డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
కుమారి	: తిరగబడరా సామి
అశోక	: కల్కి
వీఎస్ మహల్(నామవరం)	: శివం భజే
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: బడ్డీ, రాయన్
వెంకటసూర్య(కడియం)	: శివం భజే
సత్యగౌరి (అనపర్తి)	: భారతీయుడు-2
సూర్యశ్రీ (అనపర్తి)	: ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: శివం భజే
రామకృష్ణ(కోరుకొండ)	: భారతీయుడు-2
గీతాసినిమాస్ (సీతానగరం)	: రాయన్
శ్రీనివాస (గోకవరం)	: రాయన్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ---
లలితామహల్(రంపచోడవరం)	: రాయన్
నవయుగ(చింతూరు)	: -----



గోదావరి వరద తగ్గుముఖం

ధవళేశ్వరం, ఆగస్టు6: గోదావరి వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద మంగళవారం రాత్రి 8 గంటలకు నీటిమట్టం 7.90 అడుగులుగా నమోదైంది. కాటన్ బ్యారేజ్ 175 గేట్లు ఆల్ క్లియర్ పొజిషన్‌లో ఉండగా 5,09,855 క్యూసెక్కులు నీరు దిగువకు వెళుతోంది. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుతున్న నీటిమట్టం మంగళవారం రాత్రి 7 గంటలకు 32.10 అడుగులుగా నమోదైంది.

విజిలెన్స్ ఏదీ.. ఎన్‌ఫోర్స్ ఎక్కడ?





- వైసీపీ హయాంలో నిర్వీర్యం
- ఇసుక, ఇతర మైన్స్ వైపు దృష్టిపెట్టని అధికారులు
- టీడీపీ నేతలపై విచారణకు.. చిన్న తనిఖీలకే నాడు పరిమితం
- అధికారులూ కొరతే
- జూన్ నుంచి డీఎస్పీ పోస్టు ఖాళీ
- సీఐలు, ఎఫ్ఆర్వో, తహశీల్దార్ పోస్టులూ ఖాళీనే

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

విజిలెన్స్ దెబ్బతిన్నా.. ఎన్‌ఫోర్స్ తగ్గిపోయినా.. ఇక ఏ వ్యవస్థలూ సక్రమంగా నడవలేవు. ప్రభుత్వ నిధులు, అనుమతులతో నడిచే ఏ వ్యవస్థ మీద అయినా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ దృష్టి ఉండాలి. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతీ పైసా సక్రమంగా వినియోగం అయ్యేటట్టు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా, లేదా తనిఖీ చేయడానికి, ఎక్కడైనా దుర్వినియోగమైనా పట్టుకోవడానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఉంది. దీనికి అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి ఉంటారు. డీఎస్పీ ఉంటారు. వీరితోపాటు మైన్స్, రెవెన్యూ, కమర్షియల్, ఇంజనీరింగ్, వ్యవసాయం తదితర ముఖ్య శాఖల నుంచి కూడా అధికారులు ప్రత్యేకంగా ఉంటారు. సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుల్ స్థాయి అధికారులు, సిబ్బంది ఉంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో రాజమహేంద్రవరం కేంద్రంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కార్యాలయం ఉంది. 2019 వరకూ ఈ డిపార్ట్‌మెంట్‌కు చేతి నిండా పని ఉండేది. వందల కోట్ల అక్రమాలను వెలికి తీసింది. ఇసుక, లాటరైట్, గ్రావెల్, మెటల్, మట్టి అక్రమాలతోపాటు గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల పరిధిలో జరిగే అక్రమ లేఅవుట్లు, అధికారుల అక్రమాలను సైతం వెలికితీసింది. వివిధ డిపార్ట్‌మెంట్ల ద్వారా ప్రజలకు అందవలసిన స్కీమ్‌లు, ఇతర పథకాలలోని అక్రమాలను కూడా వెలికితీసేది. అక్రమాలు వెలికితీసి, వాటి విలువ కట్టి, లక్షల నుంచి కోట్ల వరకు ఫైన్ వేసి రికవరీ కోసం ప్రభుత్వానికి సిఫార్స్ చేసేది. చాలా వరకూ రికవరీ కూడా అయ్యేది. ఇంకా ఫైన్ రూపంలో వందల కోట్ల పెండింగ్ కూడా ఉంది. ముఖ్యంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అంటేనే వణుకుపుట్టేది. వీరికి చిక్కితే తమ పని ఖతం అన్న బెదురు ఉండేది. కానీ ఇప్పుడు ఇదంతా గతం. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కోరలు పీకేయడంతో నిర్వీర్యమైపోయింది. మొదట్లో వంతాడ, చింతలూరు ప్రాంతంలోని లాటరైట్‌పై సర్వే చేయించి, కనీసం ఆ నివేదికను బయట పెట్టకుండా, తర్వాత అక్కడి క్వారీ లీజుదారులను ఖాళీ చేయించి వైసీపీ నేతలు దోసుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇక ఆటు వైపు చూసే అవకాశమే లేకుండా పోయింది. టీడీపీ నేతలపై ఎంక్వయిరీలు చేయించడం వంటి కక్షసాధింపు పనులకే వీరిని మొదట్లో పరిమితం చేశారు. వంటనూనెల ధరలు విపరీతంగా పెరిగిపోయిన సమయంలో వాటిపై దృష్టిపెట్టడం సాధారణం. రూ.100లోపు ఉండే లీటరు ఆయిల్ ధరలు రూ.200 దాటేసిన సంగతి తెలిసిందే. అయినా స్పందన లేదు. అపుడప్పుడూ పీడీఎస్ షాపులు తనిఖీ చేయడం, అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ, డొమెస్టి గ్యాస్‌ను కమర్షియల్‌గా వాడుకోవడంపై తనిఖీలు వంటివి మాత్రమే చేసేవారు. దీంతో అనేక వ్యవస్థల్లో అక్రమాలు పెరిగిపోయాయి. గోదావరి ఇసుక అక్రమాలు రూ.కోట్లలో జరిగినా పట్టించుకోలేదు. కొండలకు కొండలే మాయమైపోయినా ఈ డిపార్ట్‌మెంట్‌లో కదలిక లేదు. పీడీఎస్ బియ్యం విషయంలో కాకినాడ పోర్టు నుంచి రూ.వేల కోట్ల కుంభకోణం జరిగినా పట్టించుకోలేదు. ఏదో ఉన్నామని చెప్పడానికి చిన్నాచితకా తనిఖీలతో సరిపెట్టారు.

పోస్టులూ ఖాళీనే...

మరోవైపు ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ మాత్రమే ఉన్నారు. డీఎస్పీ పోస్టు జూన్ నుంచి ఖాళీగా ఉంది. ఇద్దరు సీఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో ఒకటి ఏడాది పైనుంచి ఖాళీనే. ఎఫ్ఆర్వో పోస్టు ఖాళీ, తహశీల్దారూ లేరు. సిబ్బంది లేకుండా ఇక దాడులు ఎలా చేస్తారో మరి.

కూటమి ప్రభుత్వం దృష్టి

లెన్స్ పోగొట్టుకుని, ఫోర్స్ కోల్పోయిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌ను తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దృష్టిపెడుతోంది. ఇప్పటికే డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వంటి శాఖల్లో జరిగిన అక్రమాల గురించి గొంతెత్తిన సంగతి తెలిసిందే. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఫోర్స్‌లో ఉంటేనే కాస్త భయం ఉంటుంది. ఇది ఏ డిపార్ట్‌మెంట్‌లో అక్రమాలు చేసినా ఆరా తీసి రిపోర్టు ఇవ్వవచ్చు. 2019 వరకూ చాలా ఫోర్స్‌గా, మంచి విజిలెన్స్‌తో ఈ డిపార్ట్‌మెంట్ పనిచేసింది. వైసీపీ తన అక్రమాలకు అడ్డులేకుండా ముందుగా ఈ శాఖను నిర్వీర్యం చేసేసింది. తర్వాత అక్రమాలు, అవినీతి వ్యవహారాలను యథేచ్ఛగా చక్కపెట్టుకున్నట్టు అనేక ఆరోపణలు ఉన్నాయి. త్వరలో మళ్లీ ఈ డిపార్ట్‌మెంట్ మంచి పవర్‌ఫుల్ ఫోర్స్‌గా నిలబడే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు. ఇక ఈ శాఖకు ఏవీ అప్పారావు రోడ్డు నుంచి శ్రీరామపురం వెళ్లేదారిలో వేపదిబ్బ ప్రాంతంలో సొంత స్థలం ఉంది. అక్కడ సొంతభవనం నిర్మిస్తే పాలనా సౌలభ్యం కూడా కలుగుతుంది.

100 రోజుల యాక్షన్ ప్లాన్

- ఇక ఉద్యోగులందరూ పరుగులు పెట్టాల్సిందే
- హార్డ్‌వర్కు కాదు.. స్మార్ట్ వర్కు చూపాలి
- సీఎంతో కలెక్టర్ల కాన్ఫరెన్స్ వివరాలను తెలిపిన కలెక్టర్

రాజమహేంద్రవరం, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో 'విజన్ 2047'పై చేసిన దిశానిర్దేశం ప్రకారం జిల్లాలో రాబోయే 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఆయా శాఖలు రూపొందించిన ప్రాజెక్టు నివేదికల ఆధారంగా జిల్లా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయవలసి ఉంది' అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టంచేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం సాయంత్రం ఆమె ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.నరసింహులుతో కలసి జిల్లా డివిజన్, మండల స్థాయి అధికార్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఈ ప్రణాళికను సిద్ధంచేయాలన్నారు. 'విజన్ 2047' నోడల్ అధికారిగా జిల్లాస్థాయిలో ముఖ్య ప్రణాళికా అధికారిని నియమించినట్టు చెప్పారు. త్వరలో రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమానికి జిల్లా నుంచి ఐదుగురు అధికారులు, సిబ్బందిని మాస్టర్ ట్రైనింగ్ కోసం పంపించనున్నట్టు చెప్పారు. శిక్షణ తీసుకున్నవారు జిల్లాలో శాఖలవారీ సహాయ శిక్షణ బృందాలు ఏర్పాటుచేసి కార్యక్రమాలు అమలుచేయనున్నట్టు చెప్పారు. ఇక నుంచి ఉద్యోగులు అందరూ పరుగులు పెట్టాలి. హార్డ్‌వర్కు కాదు.. స్మార్ట్‌వర్కు ఉండాలని ఆమె స్పష్టంచేశారు. ప్రతికూల కథనాలు, వార్తలకు సంబంధించి అధికారులు సహేతుక వివరణ ఇవ్వవలసి ఉందన్నారు. కౌలు రైతులకు 100 శాతం సీసీఆర్సీ కార్డులు, డేటా ఎంట్రీ పూర్తిచేసి, బ్యాంక్ రుణాలు ఇవ్వాలని చెప్పారు. వ్యవసాయ, హార్టీకల్చర్ రంగాల్లో కౌలురైతుల వివరాల ప్రకారం సీసీఆర్సీ కార్డులు జారీచేయాలన్నారు. భూసార పరీక్షల లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్నం భోజనం పథకం కింద 100శాతం విద్యార్థులు హాజరు కావాలని చెప్పారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సమన్వయ శాఖలతో చర్చించి, ప్రణాళిక రూపొందించి, అమలుచేసే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. సమస్య గుర్తించి..ఎందుకు? ఎలా, ఎందుకు కాదు అనే విధానంలో పరిష్కారం ఉండాలని ఆదేశించారు. ఆయా సమస్యలపై సమగ్ర అవగాహన ఉండాలన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్క లబ్ధిదారునికి ఇళ్ల నిర్మాణాలపై దృష్టిపెట్టాలని కలెక్టర్ చెప్పారు. మండల ప్రత్యేకాధికారులు ప్రతీ వారం ఒకరోజు క్షేత్రస్థాయిలో హౌసింగ్‌పై సమీక్షించాలని చెప్పారు. మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఈ-ఔషధి, డాక్టర్ల ఫేషియల్ అటెండెన్స్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పంపిణీ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలు, వసతి గృహాల నిర్వహణ తదితర అంశాలపై నివేదిక అందజేయాలన్నారు. పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో ధరల నియంత్రణ కమిటీ ద్వారా ఎప్పటికప్పుడు ప్రతీ ఒక్క వినిమయ వస్తువుల ధరలు నియంత్రణ చేపట్టాలన్నారు. జిల్లాలో ఆయా వస్తువులను కొనుగోలు చేసి, ధరలు పరిశీలించి, ధరల పెరుగుదల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం









మంత్రి దుర్గేష్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నేత గన్ని కృష్ణ, ఆదిరెడ్డి అప్పారావులను సత్కరిస్తున్న దృశ్యం

- కూటమి ప్రజాప్రతినిధుల సత్కార సభలో మంత్రి దుర్గేష్
- మంత్రి సహా ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి, బత్తుల తదితరులకు ఘన సన్మానం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6: తూర్పుగోదావరి జిల్లాను అన్ని రంగాల్లోను అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలోని హోటల్ రివర్‌బేలో మంగళవారం రాత్రి జిల్లాలో కూటమి ప్రజాప్రతినిధులను టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. దీనికి మంత్రి దుర్గేష్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బాలరామకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణలు అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారిని యర్రా వేణు గోపాలరాయుడు ఘనంగా సత్కరించారు. తొలుత వేణు మాట్లాడుతూ ఎంతో అనుభవంతో జిల్లాలో అభివృద్ధికి తనదైన ముద్ర వేసిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల, ఈ ప్రాంతంపై అవగాహన కలిగిన నేతగా మంత్రి దుర్గేష్, నూతన ఆలోచనలతో అభివృద్ధిని కాంక్షించే ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వంటి ఆలోచనపరులు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు చాణక్య నీతి, గన్ని కృష్ణలాంటి సీనియర్ కమిట్‌మెంట్ నాయకులు కలిసి జిల్లాలో విద్యా, వైద్యం, ఉపాధి రంగాలను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మీ ఉద్దేశానికి తగ్గట్టుగానే ఈ జిల్లాను అభివృద్ధి చేస్తామని చెప్పారు. చంద్రబాబువంటి విజనరీ కలిగిన నాయకుడి సారథ్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో తామంతా కష్టపడి పనిచేస్తామన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబు పడుతున్న కష్టాన్ని అతి దగ్గరగా చూస్తున్నామన్నారు. మన జిల్లాలో ఎన్నో సహజ వనరులు ఉన్నాయన్నారు. 2027లో పుష్కరాలకు ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి చేపడతామన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలనూ ప్రగతి పథంలో తీసుకువెళ్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణలు మాట్లాడారు. జిల్లా అభివృద్ధితో శక్తివంచన లేకుండా తామంతా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, యనుముల రంగబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీడీపీ శెట్టి బలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ మరుకుర్తి రవియాదవ్, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, నూర్ బాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్, రామినీడి మురళీ పాల్గొన్నారు.



అఖిలభారత పశుగణన పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

సెప్టెంబరు 1 నుంచి పశుగణన

- శిక్షణా కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి
- పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు6: పశుగణనకు సంబంధించిన శిక్షణా కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 21వ అఖిల భారత పశుగణనకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీ నుంచి డిసెంబరు 31వ తేదీ వరకూ అఖిలభారత పశుగణన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. పశువుల గణనను అంకితభావంతో కచ్చితత్వంతో పూర్తిచేయాలని చెప్పారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు, డీఆర్వో నరసింహులు, రాజమహేంద్రవరం డివిజన్ పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ మక్కెన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి పశుగణన చేపట్టాలి ...

పశుగణనలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రతి ఇంటికీ వెళ్లి కచ్చితమైన గణనచేయాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు స్పష్టంచేశారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని జిల్లా పశు సంవర్ధకశాఖ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి పశుగణన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 9వ తేదీ వరకూ ఈ శిక్షణా కార్యక్రమం జరగనుంది. అనపర్తి, బిక్కవోలు, కడియం, రాజమహేంద్రవరం రూరల్, రాజమహేంద్రవరం అర్బన్, గోపాలపురం, తాళ్లపూడి మండలాల నుంచి ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.16 లక్షల కుటుంబాలు ఈ రంగంలో ఉన్నాయన్నారు. సంపూర్ణమైన, సవివరమైన పశుగణన చేయాలని ఆదేశించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ అయిరెడ్డి వీరప్రసన్నకుమార్, రాజమండ్రి డివిజన్ పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ మక్కెన వెంకటేశ్వర్లు, డీఏ హెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



హర్షకుమార్‌తో కలిసి మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

పెద్దిరెడ్డిపై వేటు తప్పదు

బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయాదవ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6: వైసీపీ నేత పెదిరెడ్డి రామచంద్రారెడ్డిపై వేటు తప్పదని బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయాదవ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అమలాపురం మాజీ ఎంపీ, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ జీవీ హర్షకుమార్‌ను మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా వారు కొద్దిసేపు పోలవరం, వర్గీకరణ అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం రామచంద్రయాదవ్ విలేకరులతో మాట్లాడారు. పెద్దిరెడ్డి ఎన్నిక చెల్లదన్నారు. అక్కడ జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో ఆధారాలతో న్యాయస్థానానికి నివేదించానన్నారు. అతని ఎన్నిక అనైతికమని, త్వరలోనే పెదిరెడ్డిపై వేటు తప్పదని హెచ్చరించారు. ఇక రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక లోపాలున్నాయని చెప్పారు. వాటిని పరిశీలన చేసి సరిచేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజ్యాంగ సవరణ జరిగి పార్లమెంట్‌లో తీర్మానం చేశాక సుప్రీం కోర్టు తీర్పు నివ్వాల్సి ఉండగా దానికి విరుద్ధంగా జరిగిందన్నారు. వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి తమ బీసీ నేతలతో చర్చించి మద్దతు ఇస్తామన్నారు. అనంతరం హర్షకుమార్ మాట్లాడుతూ పోలవరం డయాఫ్రంవాల్, కాఫర్ డ్యామ్‌లు నిర్మాణాల్లో అనేక లోపాలున్నాయని వాటిపైన, వర్గీకరణ అంశాలపైన త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని రామచంద్రయాదవ్, తాను నిర్ణయించుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవి శ్రీరాజ్, అత్తిలి తదితరులు పాల్గొన్నారు.



రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ నమూనాను రైల్వే అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తిలో రూ.10 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమం

రైల్వే అధికారులతో కలిసి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

అనపర్తి, ఆగస్టు 6 : అనపర్తిలోని మూతపడ్డ 413 రైల్వే గేటు స్థానే ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణం కోసం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన కృషి త్వరలోనే సాకారం కానుంది. రైల్వే గేటు మూత పడడంతో గేటు అవలివైపు ఉన్న కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, రైస్‌మిల్లులు, పౌల్ట్రీ ఫారాలకు వెళ్లే వ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2014-19 మధ్య ఎమ్మెల్యేగా ఉన్న నల్లమిల్లి బ్రిడ్జి నిర్మాణం కోసం చేసిన కృషి ఫలించి ఫలితం అందే సమయానికి ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. తిరిగి కూటమి అభ్యర్థిగా విజయం సాధించిన ఎమ్మెల్యే నల్లమిల్లి ఇటీవల రాజమహేంద్రవరంలో రైల్వే డీఆర్ఎమ్‌తో జరిపిన చర్చల ఫలితంగా ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు లభించాయి. అనపర్తి రైల్వే స్టేషన్‌లో అమృత్‌భారత్ ఫేజ్ 1లో భాగంగా రూ.24 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం రైల్వే సీనియర్ ఇంజనీర్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలించి బ్రిడ్జి నిర్మాణం కోసం రూపొందించిన నమూనా చిత్రపటాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ఇక్కడి ప్రజల చిరకాలవాంఛగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ముందు రైల్వే స్థలం ఎక్కడి వరకూ ఉందో తేల్చి, అవసరమైన స్థల సేకరణ చేసేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే అనపర్తిలో జన్మభూమి హాల్ట్‌ను సాధిస్తామని ఎన్నికల్లో ఎంపీ పురందేశ్వరి ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చాయన్నారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా ప్రారంభమౌతాయన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ ఇంజనీర్ శ్రీనివాస్, గజశక్తి టీమ్ సభ్యులు, ఎన్డీయే నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, మామిడిశెట్టి శ్రీను, బాసి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, బాబూరావు, కర్రి వెంకటరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



విమానాశ్రయం వద్ద నర్సరీ ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న ప్రశాంతి

మధురపూడి విమానాశ్రయం వద్ద కడియం పూల సోయగాలు ఏర్పాటు

క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

కోరుకొండ, ఆగస్టు6: కడియం నర్సరీలను పర్యాటక రంగం అభివృద్ధిలో భాగస్వామ్యం చేసే దిశగా మధురుపూడి విమానాశ్రయం అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ మధురుపూడి విమానాశ్రయాన్ని సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే క్రమంలో కడియం నర్సరీలకు అదనపు ఆకర్షణ, ఆదాయం సమకూర్చేవిధంగా నర్సరీ సోయగాలు, పచ్చదనం పరిఢవిల్లేలా స్టాల్‌లు ఏర్పాటుచేసేందుకు క్షేత్రస్థాయిలో ఇక్కడ కలెక్టర్ పరిశీలన చేశారు. 2027 పుష్కరాలకు ముందుగానే హరివిల్లు పూలస్టాల్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో సాంస్కృతిక, పర్యాటక, ఆధ్యాత్మిక, నర్సరీల హబ్‌గా గుర్తింపు తేవాలని భావిస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. విమానాశ్రయంలో కడియం నర్సరీలకు వన్నె తీసుకొచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి సమగ్ర కార్యాచరణలో రూపకల్పనలో భాగంగా తాను పరిశీలన చేశానని తెలిపారు. అలాగే ప్రముఖుల పర్యటన సందర్భంగా రూట్‌మ్యాప్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఆర్డీవో కేఎల్ శివజ్యోతి, ఎయిర్‌పోర్టు అధికారి ఎస్.జ్ఞానేశ్వర్‌రావు, ఏపీఎంఐపీ అధికారి ఎ.దుర్గేష్ పాల్గొన్నారు.



చెట్టును పరిశీలించడానికి వచ్చిన డీఎఫ్‌వో

సినిమా చెట్టును తిరిగి బతికిస్తాం!

సినిమా చెట్టును శాస్త్రీయ పద్ధతిలో తిరిగి బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా డీఎఫ్‌వో బి.నాగరాజు తెలిపారు. కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఒడ్డున ఉన్న సినిమా చెట్టు సోమవారం తెల్లవారుజామున పడిపోయిన సంగతి తెలిసిందే. మంగళవారం డీఎఫ్‌వో బి.నాగరాజు, డీఆర్‌వో వేణుగోపాల్, ఎఫ్‌బీవో ఎం.కార్తీక్‌లు ఈ సినిమా చెట్టును పరిశీలించారు. కాగా రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ సభ్యులు పరిశీలించారు. గ్రామస్తులు సహకరిస్తే పడిపోయిన సినిమా చెట్టును బతికించడానికి సహకారం అందిస్తామని, లేదా కొత్త చెట్టును తీసుకువచ్చి అక్కడ ఏర్పాటుచేస్తామన్నారు. అమెరికాలోని వాషింగ్టన్‌కు చెందిన ఉయ్యూరి లోకేశ్ సినిమా చెట్టును బతికించడానికి తమవంతు సహకారం అందిస్తామని ముందుకు వస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. - కొవ్వూరు

కోతకు గురైన ప్రాంతాల్లో అత్యవసర పనులు

అధికారులతో సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ వీడియో కాన్ఫరెన్స్

కొవ్వూరు, ఆగస్టు 6: అధిక వర్షాలు, వరదల కారణంగా కోతకు గురైన ప్రాంతాల్లో అత్యవసర పనులను త్వరగా చేపట్టి పూర్తిచేయాలని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ చెప్పారు. మంగళవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం నుంచి డివిజన్ పరిధిలోని జలవనరులశాఖ అధికారులు, తహశీల్దార్లతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వర్షాలు, వరదలతో కొవ్వాడ, ఎర్రకాల్వ, యనమదురు డ్రైన్‌లు పొంగి కోతకు గురైన ప్రాంతాలపై సమీక్షించారు. యర్నగూడెం, జగన్నాథపురం, సూర్యారావుపాలెం, కాల్ధరి, సాగిపాడు, గంగోలు, త్యాజంపూడి, కోరుమామిడి గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని, యర్నగూడెం, మద్దూరులంకలలో పనులు పూర్తయ్యాయన్నారు. అత్యవసర పనులకు ఇసుక అవసరమైతే తహశీల్దార్లు స్పందించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పనుల ప్రగతిని తనిఖీ చేయనున్నారని సబ్ కలెక్టర్ చెప్పారు.

సీఐ విజయబాబు బాధ్యతల స్వీకారం



కొవ్వూరు, ఆగస్టు 6: కొవ్వూరు రూరల్ సీఐగా కె.విజయబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన పి.శ్రీనివాసరావును పోలీసు ఉన్నతాధికారులు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో రాజమహేంద్రవరం సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న విజయబాబును కొవ్వూరు రూరల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తానన్నారు. సీసీ కెమెరాల వినియోగంపై గ్రామాల్లో సదస్సులు ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

బైక్ అదుపుతప్పి ఉపాధ్యాయుడికి గాయాలు

తాళ్లపూడి-కొవ్వూరు ఏటిగట్టుపై తరచూ ప్రమాదాలు

తాళ్లపూడి, ఆగస్టు 6: తాళ్లపూడి-కొవ్వూరు ఏటిగట్టు రోడ్డులో ఇసుక రవాణాతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇసుక లారీలు రోడ్డుపైకి తెచ్చిన మట్టితో మోటారుసైకిళ్లు జారిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. తాళ్లపూడికి చెందిన యడ్ల సత్యనారాయణ దొమ్మేరు స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మంగళవారం బైక్‌పై స్కూల్‌కి బయలుదేరిన ఆయన బల్లిపాడు శివారు చిడిపి గ్రామ సమీపంలో ఏటిగట్టుపై బురద మట్టి వల్ల బైక్ జారిపోయింది. కాలు, తలకి బలమైన గాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని సాయి ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఏటిగట్టుపై వాహనదారులు ప్రమాదాలను నివారించేందుకు అధికారులు, నాయకులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షనీయం



దండోరా ఉద్యమంలో అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కొవ్వూరు, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణపై 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పునివ్వడం హర్షనీయమని ఎమ్మార్పీఎస్ నాయకుడు పెనుమాక జయరాజు అన్నారు. సోమవారం రాత్రి కొవ్వూరు పీఆర్ఆర్ కళ్యాణ మండపంలో మాదిగ నాయకుల సమావేశం నిర్వహించారు. ఉద్యమంలో అమరులైన వారికి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ ఉద్యమం ఒక చరిత్రని దానిని బావితరాల భవిష్యత్‌కు ఉపయోగపడేల మాదిగ పల్లెల్లో విద్యారంగ అబివృద్ధికి దండోరా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రిజర్వేషన్ ఫలాలు అందరికి అందేలా భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాల ద్వారా మాదిగల సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. కార్యక్రమంలో దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి రాజు, ఎంవీ రావు, కొడమంచిలి సత్యనారాయణ, డి.ప్రకాష్, ఎం.ప్రకాశరావు, ఎం.రవికుమార్, కె.పృథ్వీరాజ్, పి.హరికృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుబాబు

ఉండ్రాజవరం, ఆగస్టు 6: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 30ఏళ్లుగా ఎస్సీవర్గీకరణకు ఉద్యమించి సాధించుకున్న ఎస్సీ వర్గీకరణపై ఏపీ, తెలంగాణా ప్రభుత్వాలు అసెంబ్లీలో బిల్లు పెట్టి వెంటనే ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిద్దే మధుబాబు మంగళవారం ప్రభుత్వాలను కోరారు. బిల్లు ప్రవేశపెట్టిన తర్వాత ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. ఎస్సీలోని 59 కులాలు సామాజికంగా, విద్య, ఉద్యోగపరంగా వెనుకబడి ఉన్నాయని, అన్ని కులాలకు సమాన న్యాయం జరగాలంటే వర్గీకరణే శరణ్యమని ఆయన పేర్కొన్నారు. వచ్చే వారంలో మండలస్థాయిలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

అలెగ్జాండర్ ఫ్లెమింగ్ జయంతి

కొవ్వూరు, ఆగస్టు 6: అలెగ్జాండర్ ఫ్లెమింగ్ చేసిన ప్రయోగం నేడు అనేక రుగ్మతలను నిర్మూలిస్తోందని ప్రిన్సిపాల్ ఎస్‌వీ సుబ్బారావు అన్నారు. కొవ్వూరు ఏబీఎన్&పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో అలెగ్జాండర్ ఫ్లెమింగ్ జయంతిని లైఫ్‌సైన్సు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు పరిశోధనలు చేయాలన్నారు. కళాశాలలో కెమిస్ట్రీ ఫైనలియర్ విద్యార్థులకు పాలిమర్ కెమిస్ట్రీ 30గంటల అదనపు కోర్సును ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా లైఫ్‌సైన్సు విద్యార్థులు ఫ్లెమింగ్ పరిశోధనలను వివరించారు.

రేపు రక్తదాన శిబిరం.. జీఎస్టీ డే సందర్భంగా తలసేమియా బాధితుల సహాయార్థం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఈ నెల 8న కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. కొవ్వూరు పరసర ప్రాంతాల్లోని దాతలు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమేష్, డి.మాధురిదేవి, కె.సురేష్‌బాబు, టి.శశికళ, బి.రత్నదీపిక, ఎ.మల్లిక, చలపతిరావు, కె.సూరిబాబు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన ద్విసభ్య కమిటీ



మంత్రి అచ్చెన్నాయుడితో ద్విసభ్య కమిటీ సభ్యులు

కొవ్వూరు, ఆగస్టు 6: కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రావు కృష్ణా రామకోరారు. రాష్ట్ర వ్యవసాయశాఖ శాఖా మంత్రి కింజరపు అచ్చెన్నాయుడిని వారు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు గొర్రెల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 29మంది ఉద్యోగాలకు ఎంపిక

నిడదవోలు, ఆగస్టు 6: నిడదవోలులోని ఎస్వీఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం దివీస్ లేబోరేటరీస్ నిర్వహించిన జాబ్ మేళాలో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు వైస్ ప్రిన్సిపాల్ ఈ.నాగేశ్వరరావు తెలిపారు. బీఎస్సీ, బీ-ఫార్మసీ, బీటెక్, ఎమ్మెస్సీ, ఎం-ఫార్మసీ ఉత్తీర్ణులైన సుమారు 50 మంది విద్యార్థులు ఈ మేళాలో పాల్గొనగా 29 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, వీరిలో ఏడుగురు కళాశాల పూర్వ విద్యార్థులున్నారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని అధ్యాపకులు, దివీస్ లెబోరేటరీస్ ప్రతినిధులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

నిడదవోలు, ఆగస్టు 6: నిడదవోలులోని జడ్పీ బాలికోన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు కె.జ్యోతి, డి.సత్యశ్రీ రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం చెరుకూరి పద్మ తెలిపారు. వీరిద్దరూ ఇటీవల గణపవరంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచారని, విశాఖపట్టణంలో సెప్టెంబరు 13,14,15 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పీఈటీ వి.శాంతి, ఉపాధ్యాయ బృందం, పట్టణ ప్రముఖులు అభినందించారు.

'అందరి ఇళ్లపై జాతీయ జెండా ఎగరాలి'

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 6: ఈ నెల 15న అందరి ఇళ్లపై జాతీయ జెండాలు ఎగురవేసేలా బీజేపీ కేడర్ అంతా పనిచేయాలని పార్టీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్ అన్నారు. మంగళవారం హర్ ఘర్ తిరంగాపై రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో పార్టీపరంగా చేయవలసిన కార్యక్రమాలపై చర్చించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, కాశీ విశ్వనాధరాజు, కోడూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో కుక్కల బెడద

- దారినపోయే వారిని వెంబడించి దాడి చేస్తున్నవైనం
- జూలైలో చాగల్లు పీహెచ్‌సీలో 19 కుక్కకాటు కేసులు
- పంచాయతీల్లో ఫిర్యాదు చేస్తున్నా ఫలితం శూన్యం



చాగల్లులో కాన్వెంట్‌కు వెళ్లే వీధిలో తిష్ట వేసిన కుక్కలు

చాగల్లు, ఆగస్టు 6: మండలంలో వీధి కుక్కలు బెడద తీవ్రంగా ఉంది. కుక్కల సంచారం వల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ ఉండే కుక్కలు దారిన పోయే వారిపై దాడి చేసి కరుస్తున్నాయి. వాహనాలపై వెళ్లే వారిని కూడా వెంబడించి కరుస్తున్నాయి. గ్రామాల్లో సాధారణంగా పారిశుధ్య సమస్య అధికంగా ఉంటుంది. దానికంటే కుక్కల బెడదే ఎక్కువగా ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, వృద్ధులు మరింత బెంబేలెత్తుతున్నారు. వాహనాలపై ప్రయాణించే వారిని కుక్కలు గుంపులుగా వెంబడిస్తున్నాయి. కుక్కల సమస్యపై గ్రామస్థులు పంచాయతీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఫలితం ఉండటం లేదని అంటున్నారు. కుక్కకాటు కేసులు జూలై నెలలో మండల కేంద్రమైన చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 19 నమోదయ్యాయి. వెటర్నరీ అసిస్టెంట్ యు.ముఖేష్ దృష్టికి తీసుకురాగా కుక్కల నిర్మూలనకు చట్టం అనుమతించదని, ప్రమాదం లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని, కుక్కలకు వ్యాక్సిన్ వేసి ప్రమాదం లేకుండా చూస్తున్నామన్నారు. పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని, జంతుల ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

చంద్రబాబు స్ఫూర్తితో అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- ఉప్పరగూడెంలో సీసీ రోడ్డు, కమ్యూనిటీ హాల్ ప్రారంభం



కల్వర్టు కం సీసీ రోడ్డు శిలాఫలకం ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, ఆగస్టు 6: అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లల్లో ముందుకు తీసుకెళ్లగలిగే సత్తా సీఎం చంద్రబాబుకే ఉందని, ఆయన స్ఫూర్తితోనే నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గోపాలపురంలోని ఉప్పరగూడెంలో పంచాయతీ, మండల పరిషత్ నిధులతో నిర్మించిన కల్వర్టులు, సీసీ రోడ్డు, ఎస్సీ కమ్యూనిటీ హాలును ఆయన మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి అవసరమైన నివేదికలు తయారు చేయాలని పంచాయతీ రాజ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామాధ్యక్షుడు జ్యేష్ట శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ యువత ప్రభుత్వం ఇస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణను వినియోగించుకోవాలన్నారు. అనంతరం వెదుల్లకుంటలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్మించిన భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ కాకులపాటి లత, సర్పంచ్ పైడి శిరీష, ఈలి శరత్‌బాబు, కొర్లపాటి రాము, వేముల నాగరాజు, సురేష్, కూనపం ప్రసాద్‌బాబు, జ్యేష్ట శ్రీనివాసరావు, యండ్రాప్రగడ మంగారావు, మద్దిపాటి రమేష్ పాల్గొన్నారు.

ఎస్ఐ శ్రీహరిరావు సేవలు అభినందనీయం

దేవర పల్లి, ఆగస్టు 6: దేవరపల్లి ఎస్ఐ కె.శ్రీహరిరావు కొవ్వూరు రూరల్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన అభినందన సభకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి ఎస్ఐను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవరపల్లిలో మూడేళ్ల సర్వీసులో శ్రీహరిరావు ఎన్నో అవార్డులు, రివార్డులతోపాటు ప్రజల మన్ననలు పొందారని, ఆయన సేవలు అభినందనీయమని అన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ సహచర సిబ్బంది ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే సమర్థవంతంగా విధులు నిర్వహించగలిగానన్నారు. కార్యక్రమంలో సీఐ బాలసురేష్, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన భీమోలు పట్టాదారు రైతులు

నల్లజర్ల, ఆగస్టు 6: ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును భీమోలు పట్టాదారు రైతులు మంగళవారం నల్లజర్ల టీడీపీ కార్యాలయంలో కలిశారు. వైసీపీ ప్రభుత్వంలో తమ భూములను అన్యాయంగా లాక్కున్నారని, 20 ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమోలు భూములపై సమగ్ర విచారణ చేసి అవి అర్హులకు చెందే విధంగా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సీడీపీవో మమ్మీ

కొవ్వూరు, ఆగస్టు 6: తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ చెప్పారు. మంగళవారం కొవ్వూరులోని 22వ వార్డులో 49,51,52 అంగన్వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ బి.ఉదయబాను ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మమ్మీ తల్లి, బిడ్డ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కె అమూల్య, తల్లులు, గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా యర్నగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయశాంతి మాట్లాడుతూ పుట్టిన ప్రతీ బిడ్డకు మొదట ఆహారం తల్లిపాలని, అవి ఎంతో శ్రేష్టమైనవని అన్నారు. బిడ్డపుట్టిన వెంటనే ముర్రిపాలు పట్టాలని దీని వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని విజయశాంతి అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లి: యర్నగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు



చాగల్లులో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

గోపాలపురం: గోపవరంలో ర్యాలీ నిర్వహించి తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు రజని, గ్రేసమ్మ, లలిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు సచివాలయం 3 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తల్లిపాలపై తల్లులకు అవగాహన కలిగించారు. డబ్బా పాలు ఆరోగ్యానికి హానికరమని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు లీడరు మాణికమ్మ, జయలక్ష్మి, మహాలక్ష్మి, సౌదామణి, సుశీల, సచివాలయ కార్యదర్శి సుప్రజ, దుర్గాదేవి పాల్గొన్నారు.

నల్లజర్ల: పోతవరంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు జరిగాయి. తల్లి పాల విశిష్టతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చారిత్రక ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి కృషి

- ప్లే గ్రౌండ్ మరింత సమర్థవంతంగా వినియోగం
- ఆర్ట్స్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను సందర్శిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 6: చారిత్రక ఆర్ట్స్ కళాశాలను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను సందర్శించారు. తరగతి గదులు, లైబ్రరీ పరిశీలించారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కేతో ప్రత్యేకంగా సమావేశమై కళాశాలకు సంబంధించిన పలు అంశాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం కళాశాల గ్రౌండును స్టేడియం నిర్మాణం పేరుతో లాక్కోవడానికి ప్రయత్నించగా విద్యార్థులు అడ్డుకున్నారన్నారు. కళాశాల నుంచి ఎంతోమంది జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించే విధంగా ఫుట్‌బాల్, ఇతర క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు సరైన ప్రోత్సాహాన్ని గత ప్రభుత్వం ఇవ్వలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో విద్యతో పాటు క్రీడల్లోను విద్యార్థులు రాణించే విధంగా ప్రోత్సాహం అందిస్తామన్నారు. కళాశాల ప్లే గ్రౌండును మరింత అభివృద్ధి చేస్తామని, పూర్వ విద్యార్థుల సంఘం, ఇతర సంస్థల సహకారంతో కళాశాలకు వైభవాన్ని తీసుకొస్తామన్నారు. ఇప్పటికే నగరంలో స్పోర్ట్సు కాంప్లెక్స్ కోసం ఖేలో ఇండియాతో సహకారం తీసుకునే విధంగా ఎంపీ పురందేశ్వరి చర్యలు తీసుకుంటున్నారన్నారు. దాతల సహకారంతో తరగతి అదనపు గదులు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల లైబ్రరీలో 16వ శతాబ్దం నుంచి నేటి వరకూ గత చరిత్ర వైభవాన్ని తెలుసుకునే విధంగా పుస్తకాలను అందుబాటులో ఉంచి సంరక్షించడం, వాటిని డిజిటలైజ్ చేసే ప్రక్రియ చేపట్టడం ప్రశంసనీయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశీ నవీన్‌కుమార్, కుడుపూడి సత్తిబాబు, రవి యాదవ్, అలూమ్ని అధ్యక్షుడు మాధవ్, గద్దే సుధాకర్, భార్గవ్, వరప్రసాద్, విజయలక్ష్మి, బేబి, శివకుమార్, రేవతి, ఎం.సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకం



ఉండ్రాజవరం, ఆగస్టు 6: ఉండ్రాజవరంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు భజన కార్యక్రమం నిర్వహించారు.

బీసీ బిల్లుకు సహకరించిన వారినే ప్రధానిని చేయాలి

ఢిల్లీ మహాధర్నాలో జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6: బీసీ బిల్లుకు ఎవరైతే సహకరిస్తారో వారిని ప్రధాన మంత్రిని చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత అన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నిర్వహించిన మహాధర్నాలో తమ నాయకుడు ఆర్.కృష్ణయ్యతో పాటు ఉపాధ్యక్షుడు గుజ్జు సత్యం ఆధ్వర్యంలో నిరసన తెలిపామని ఆమె చెప్పారు. రాజమహేంద్రవరానికి చెందిన ఆమె ఈ మేరకు మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు కల్పించడంపై కోర్టు అభ్యంతరం చెప్పడం అన్యాయమన్నారు.

మానసికారోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 6: మానసిక ఆరోగ్య సమస్యలపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ మానసిక ఆరోగ్య అవగాహన దినం సందర్భంగా మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో వైద్యులకు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడం, సంబంధిత వైద్య సేవలందించడం ఆరోగ్యరంగంలో ప్రధానమని స్పష్టంచేశారు.

నల్లజర్ల పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న వైద్యాధికారులు

నల్లజర్ల, ఆగస్టు 6: నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ బృందం మంగళవారం తనిఖీ చేసింది. జిల్లా ప్రోగ్రాం అధికారి కె.సంధ్యారాణి, జిల్లా డేటా మేనేజర్ ఎస్.రామకృష్ణ ఆసుపత్రితోపాటు,గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్యులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ తెల్లం గంగాధర్, జీవీవీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా పాఠశాల విద్యాధికారి వాసుదేవరావు

రాజమహేంద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం 2024-25కి సంబంధించి డిసెంబరు 8న నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానించారని జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సదుపాయం లేకుండా ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి విద్యనభ్యసిస్తున్న వారు అర్హులన్నారు. కుటుంబ సంవత్సరాదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ రూ.50 పరీక్షా రుసుంతో సెప్టెంబరు 10వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఫీజును ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. పూర్తి వివరాలు www.bse.ap.gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉన్నాయని. లేదా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

మహిళా హాస్టల్స్ బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

డీఆర్వోకు ఏఐఎస్ఎఫ్ వినతి పత్రం అందజేత



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 6: జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న అసౌకర్యాల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్, ఇతర నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ భద్రత దృష్ట్యా మహిళల హాస్టల్స్ బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. గత ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టళ్లను గాలికి వదిలేసిందని, దీంతో హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు తక్షణమే విడుదల చేయాలని, హాస్టళ్ల నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రధానంగా నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు, రాజమహేంద్రవరంలో పలు హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరాయని, వీటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎండ్రపాటి సునీల్, వివేక్, అనీష్, జీవన్, రాజు, జయంత్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపల్లి సర్పంచ్‌పై దాడి

ఆసుపత్రికి తరలింపు.. పరస్పర కేసులు



విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ అంబికాప్రసాద్

బిక్కవోలు, ఆగస్టు 6: ఇళ్లపల్లి సర్పంచ్ లొల్ల భద్రంపై సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చారని రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ అంబికాప్రసాద్ తెలిపారు. భద్రాన్ని చెరువుల విషయంపై మాట్లాడాలని ఇంటి నుంచి రాత్రి 8గంటలకు రప్పించి అతనిపై దాడి చేసి కారులో తీసుకుపోవడానికి ప్రయత్నించగా గ్రామస్థులు వచ్చి అడ్డుకున్నారు. దీంతో నలుగురు వ్యక్తులు రెండు బైక్‌లపై రంగంపేట మండలం మర్రిపూడి వైపు వెళ్లారు. విషయం తెలిసిన బిక్కవోలు ఎస్ఐ పి.బుజ్జిబాబు రంగంపేట ఎస్ఐకు తెలియపర్చగా వారిని మర్రిపూడిలో అదుపులోకి తీసుకున్నారు. వారికి కూడా గాయాలు కావడంతో పెద్దాపురం ఆసుపత్రికి, గాయాల పాలైన భద్రాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. భద్రం ఫిర్యాదు మేరకు బిక్కవోలు పోలీసులు కేసు నమోదు చేశారు. తమను గాయపర్చారంటూ నలుగురు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుపై రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విషయం తెల్సిన వెంటనే తాను సోమవారం రాత్రి బిక్కవోలు పోలీసులతో ఇళ్లపల్లి వెళ్లి రాత్రంతా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూశామని డీఎస్పీ చెప్పారు. ప్రస్తుతం ఇళ్లపల్లిలో ప్రశాంత వాతావరణం వుందన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలకు లోబడి నడచుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏ, వైద్యారోగ్యశాఖ సమన్వయంతో ఎస్టీ మహిళా హాస్టల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డి.అలేఖ్య, స్టాఫ్‌నర్స్ కె.శారద, ల్యాబ్ టెక్నీషియన్ వై.బాలదుర్గ, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు కె.బేబీ, కె.కరుణ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణమ్మపేట ఆర్‌వోబీ పరిశీలన

రాజమహేంద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అన్నపూర్ణమ్మపేటలోని రైల్వే ఆర్‌వోబీ నిర్మాణానికి అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ నెల 3న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రైల్వే ఉన్నతాధికారులు రైల్వే స్టేషన్‌ని పరిశీలించి సమగ్రంగా చర్చించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా రైల్వే అధికారులు రంగంలోకి దిగారు. గతిశక్తి(రైల్వే బోర్డు) నుంచి వచ్చిన సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్‌తో కూడిన బృందం నగరపాలక సంస్థ అధికారులతో కలిసి అన్నపూర్ణమ్మపేట ఆర్‌వోబీ ప్రదేశాన్ని సందర్శించి సర్వే నిర్వహించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	రాయన్,కల్కి
వై.స్క్రీన్2	శివం భజే
దేవిశ్రీ(గాయత్రి	బడ్డీ
అనన్య	తిరగబడరా సామీ
నిడదవోలు	
వీ మ్యాక్స్	బడ్డీ
రాధాకృష్ణ	రాయన్
శ్రీగణపతి	శివం భజే
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	శివం భజే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	శివం భజే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	---
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---